


RNI NO. TELTEL/2014/61071

# జన తెలంగాణ

తెలుగు దిన పత్రిక

PUBLISHED PROM:HYDARABAD,KARIMNAGAR,KAMMAM,V IZAYAWADA,KADAPA,THIRUPATHI

సంపుటి : 14 సంచిక :128 | గురువారం ఆగస్ట్ 27, 2026 | ఎడిటర్ - ఆర్. చైతన్య | పేజీలు 6 | వెల-5

## సీజేపీ నిరసనల తర్వాత..

### ఇన్‌స్టాలో పెరిగిన మోదీ, రాహుల్ క్రేజ్



దిల్లీలో ఇటీవల జరిగిన కాక్రోచ్ జనతా పార్టీ నిరసన అనంతరం జెన్‌జీకి దగ్గరకావడానికి కేంద్ర ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంది. విద్యార్థులను ఉద్దేశించి ప్రధాని మోదీ ఇన్‌స్టాగ్రామ్‌లో పలు వీడియోలు షేర్ చేశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సైతం 'ఆస్క్ మీ ఎనీథింగ్' సెషన్‌లలో పాల్గొన్నారు. విద్యార్థులతో మాట్లాడిన వీడియోలను ఇన్‌స్టాలో పోస్ట్ చేశారు. పలువురు కేంద్రమంత్రులు కూడా యువతతో మమేకమవ్వడానికి ఆసక్తి చూపించారు.

2లో

## 'ఆ పరీక్ష ప్రశ్నపత్రాన్ని రూ.40 లక్షలకు అమ్మేశారు'..!



డ్రగ్ ఇన్‌స్పెక్టర్ గ్రూప్-బి పోస్టుల నియామక ప్రక్రియను మహారాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్‌రద్దు చేసింది. ఈ ఏడాది మార్చిలో నిర్వహించిన పరీక్షలో అవకతవకలు జరిగాయనే ఆరోపణలపై ప్రాథమిక విచారణ అనంతరం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. మరోవైపు.. ఈ పరీక్ష ప్రశ్నపత్రాన్ని రూ.40 లక్షల చొప్పున అమ్మేశారని ప్రతిపక్ష ఎన్సీపీ (ఎస్పీ) ఎమ్మెల్యే రోహిత్ పవార్ ఆరోపించారు. పేజి 2లో ▶

# నాగార్జునసాగర్‌లో మళ్లీ జల వివాదం..

## బోర్డు అనుమతి లేకుండా ఏపీ నీటి విడుదల

- నాగార్జునసాగర్ వద్ద మరోసారి జల వివాదం
- ఏపీకి 10 టీఎంసీలు, తెలంగాణకు 15 టీఎంసీలు
- ఏపీ వాటా నీరు ఇప్పటికే పూర్తి వినియోగం
- అనుమతి లేకుండా 1,600 క్యూసెక్కుల విడుదల ఆరోపణ
- తెలంగాణ వాటాలో ఇంకా నీరు మిగిలి ఉంది
- తెలంగాణ 1,000 క్యూసెక్కుల నీరు విడుదల
- ఏపీ తీరుపై తెలంగాణ అధికారుల అభ్యంతరం







నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ దగ్గర మరోసారి జల వివాదం తెరపైకి వచ్చింది. ఇరు రాష్ట్రాల మధ్య నీటి కేటాయింపులు, వినియోగంపై ఉద్రిక్త వాతావరణం నెలకొంది. మే నెలలో కృష్ణా నృష్ణా బోర్డు (ఖ=వీదీ) సమావేశంలో ఇరు రాష్ట్రాలకు నీటిని కేటాయించారు. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌కు 10 టీఎంసీలు, తెలంగాణకు 15 టీఎంసీల నీటిని కేటాయించారు. అయితే ఏపీ తనకు కేటాయించిన 10 టీఎంసీల నీటిని ఇప్పటికే పూర్తిగా వినియోగించుకుంది.

ఈ తరుణంలో కృష్ణా నృష్ణా బోర్డు (ఖ=వీదీ) ఎలాంటి అధికారిక అనుమతులు ఇవ్వకపోయినప్పటికీ, ఏపీ ఇరిగేషన్ , జెన్‌కో అధికారులు ఏకపక్షంగా వ్యవహరించారనే ఆరోపణలు వస్తున్నాయి. కుడి కాలువ పవర్‌హౌస్ ద్వారా ఏకంగా 1600 క్యూసెక్కుల నీటిని ఏపీ అధికారులు విడుదల చేశారు.

మరోవైపు, తెలంగాణకు ఇంకా నీటి వాటా మిగిలి ఉండటంతో.. స్థానిక ప్రజల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని తెలంగాణ ఇరిగేషన్ అధికారులు అప్రమత్తమయ్యారు. తెలంగాణ వాటాలో భాగంగా ఎడమ కాలువ ద్వారా 1000 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. నిబంధనలకు విరుద్ధంగా, బోర్డు అనుమతి లేకుండా ఏపీ నీటిని విడుదల చేయడంపై ఇప్పుడు తీవ్ర వివాదం చెలరేగింది.

## ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ కార్యక్రమాన్ని అడ్డుకుంటామన్న న్యూయార్క్ మేయర్‌పై కిషన్‌రెడ్డి మండిపాటు

### మోహన్ భగవత్ కార్యక్రమంపై వివాదం

- 29న మాడిసన్ స్క్వేర్ గార్డెన్‌లో కార్యక్రమం
- అడ్డుకుంటామని మమ్దానీ ప్రకటన
- మమ్దానీపై కిషన్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం
- ప్రకటన భారత్ వ్యతిరేకతకు నిదర్శనమని విమర్శ
- ఓటు బ్యాంకు రాజకీయాల కోసమేనని ఆరోపణ



దిల్లీ: ఈనెల 29వ తేదీన అమెరికాలోని మాడిసన్ స్క్వేర్ గార్డెన్‌లో జరగబోయే ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ కార్యక్రమాన్ని అడ్డుకుంటామని న్యూయార్క్ మేయర్ జోహ్రాన్ మమ్దానీ చేసిన ప్రకటన పట్ల కేంద్ర మంతి కిషన్‌రెడ్డి మండిపడ్డారు. "భారతీయులనుద్దేశించి మోహన్ భగవత్ ప్రసంగించబోయే కార్యక్రమాన్ని వ్యతిరేకిస్తున్నట్లు జోహ్రాన్ మమ్దానీ చేసిన ప్రకటన ఆయన భారత వ్యతిరేకతకు అద్దంపడుతోంది. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం, భారత్‌లోని ప్రజాస్వామ్యాన్ని వ్యతిరేకించే అసాంఘిక శక్తుల మెప్పు పొందేందుకు మోహన్ భగవత్ కార్యక్రమాలను అడ్డుకోవాలని అక్కడి మేయర్ నిర్ణయించారు. సమ్మిళిత సాంస్కృతిక సమావేశాలపై ఉద్దేశపూర్వకంగా దాడి చేస్తున్నారు. సాంస్కృతిక మూలాలు, వారసత్వాన్ని చూసి గర్వపడే భారతీయ అమెరికన్లు, ప్రవాస భారతీయులపట్ల మమ్దానీకున్న అసహనాన్ని ఈ ప్రకటన బహిర్గతం చేస్తోంది. ప్రజాస్వామ్య విలువలు, వసుధైక కుటుంబక సిద్ధాంతాన్ని పాటించే భారత్‌కు విద్వేషాలు, విభజనను ఆయుధంగా వాడుకొనే ఇలాంటి వారి నీతులు అవసరం లేదు" అని కిషన్‌రెడ్డి మండిపడ్డారు. ఈమేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

## ప్రపంచస్థాయిలో అమరావతి నిర్మాణం: నాదెండ్ల మనోహర్

### శాసనసభ భవన రూపకల్పనపై నార్మన్ ఫోస్టర్స్ బృందంతో చర్చలు

- డీలిమిటేషన్ దృష్టిలో ఉంచుకుని దీర్ఘకాలిక డిజైన్లు
- సందర్శకుల కోసం ప్రత్యేక ఎక్స్‌పీరియన్స్ సెంటర్
- పచ్చదనం, అండర్‌గ్రౌండ్ పార్కింగ్‌తో ఆధునిక ప్రాంగణం



**అమరావతి, ఆగష్టు 26 :** ప్రపంచంలోనే అద్భుతమైన రాజధానిగా అమరావతిని నిర్మించడమే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లక్ష్యమని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. సచివాలయంలో అంతర్జాతీయ ఆర్కిటెక్చర్ సంస్థ నార్మన్ ఫోస్టర్స్ అండ్ పార్టనర్స్ ప్రతినిధులతో ఉన్నతస్థాయి సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. శాసనసభ భవనాన్ని అత్యున్నత ప్రమాణాలు, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దేందుకు సమగ్రంగా చర్చించినట్లు పేర్కొన్నారు.

**అత్యాధునిక సదుపాయాలు**

శాసనసభ భవనంపై ప్రత్యేక టవర్ ఏర్పాటు చేసి నగరాన్ని వీక్షించేలా రూపకల్పన చేస్తున్నామని తెలిపారు. భవిష్యత్ డీలిమిటేషన్ దృష్టిలో ఉంచుకుని 265 అసెంబ్లీ, 110 కౌన్సిల్ స్థానాలకు సరిపడేలా ఏర్పాట్లు ఉంటాయన్నారు. పేజి 2లో ▶

## జీసీసీల ఏర్పాటుకు హైదరాబాద్ తొలి ఎంపిక:

### జీసీసీలకు హైదరాబాద్ తొలి ఎంపిక

- గతేడాది 75 జీసీసీలు రాక
- వచ్చే ఏడాది మరో 100 జీసీసీల లక్ష్యం
- హైటెక్ సిటీలో ఆక్టేవ్ కొత్త సెంటర్
- ఐటీతో పాటు పలు రంగాల్లో కంపెనీలు
- ఏఐ, డేటా, క్లౌడ్‌పై ఆక్టేవ్ దృష్టి
- హైదరాబాద్‌లో బలమైన టెక్ ఎకోసిస్టమ్



2లో

## ప్రజల ఆస్తులను రాత్రికి రాత్రే నిషేధిత జాబితాలో పెట్టారు:

- 22ఏలో ప్రజల ఆస్తుల చేర్పు
- ప్రభుత్వమే కబ్జాదారుగా మారింది: హరీశ్‌రావు
- భూముల కేంద్రంగా కాంగ్రెస్ పాలన
- రూ.30 వేల కోట్ల భూముల విక్రయం
- ప్రజల భూములతో ఇబ్బందులు
- అనుచరులకు భూముల కట్టబెట్టారని ఆరోపణ



2లో

## పార్టీ నేత కోరిక.. ఇంటి ఆడబిడ్డగా వధువు మెడలో తాళి కట్టిన కవిత



2లో



## 31న వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభం

- మూడు దశాబ్దాల కల నెరవేరుస్తున్న చంద్రబాబు
- నిర్వాసితుల త్యాగాలకు ప్రభుత్వం పాదాభివందనం
- 40 రోజుల్లోనే నిర్వాసితులకు 768 కోట్లు విడుదల

2లో

## రాష్ట్ర ప్రగతిని అడ్డుకునేందుకు కుట్రలు

- ఎక్సైజ్, గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర
- ప్రభుత్వంపై జగన్మోహన్ రెడ్డి అసత్య ప్రచారాలు
- అసెంబ్లీకి రాకుండా ప్రెస్ మీట్లతో కాలయాపన
- సాగునీటి ప్రాజెక్టులకు కూటమి ప్రభుత్వంలో భారీ నిధులు
- బీసీల సంక్షేమానికి కట్టుబడిన ప్రస్తుత ప్రభుత్వం



2లో

RNI NO. TELTEL/2014/61071
జన తెలంగాణ
తెలుగు దిన పత్రిక
గురువారం ఆగస్ట్ 27, 2026

# సంపాదకీయం

## సైద్ధాంతిక రాజకీయాలు ఏవీ?

'పాతికేళ్ల క్రితం నేను మీ నాన్నను కలుసుకునేందుకు మీ ఇంటికి స్కూటర్‌పై వచ్చాను గుర్తుందా?' అని ప్రధానమంత్రి నరేంద్రమోదీ గుజరాత్‌కు చెందిన ఒక యువనేతను ఉద్దేశించి అన్నారు. 1991లో మురళీమనోహర్ జోషీతో పాటు ఏక్తా యాత్రకు సహాయంగా వచ్చినప్పుడు 'నీవు ఒక పిల్లవాడిగా మాకు ఫలహారాలు అందించావు' అని ఆయన మరో నేతకు చెప్పారు. '2014లో నేను ప్రధాని కాకముందు హైదరాబాద్ వచ్చినప్పుడు ఎల్బీ స్టేడియంలో యువసమ్మేళనం నీ ఆధ్వర్యంలోనే జరిగింది కదా, అప్పుడు టికెట్ పెట్టినా భారీ ఎత్తున యువత హాజరైంది' అని ఏపీకి చెందిన మరో నాయకుడితో మోదీ అన్నారు. కొత్తగా నియమితులైన బీజేపీ పదాధికారులతో దాదాపు నాలుగు గంటల పాటు మోదీ సమావేశమైనప్పుడు జరిగిన సంభాషణలివి. బీజేపీ పదాధికారులందర్నీ తన చుట్టూ కూర్చోబెట్టుకుని దాదాపు 50 మందితో మాట్లాడనిచ్చిన మోదీ.. మధ్య మధ్యలో వారితో తన అనుబంధాన్ని, గత స్మృతులను నెమరు వేసుకున్నప్పుడు వారు ఆశ్చర్యపోయారు. కొంతమంది అయితే కన్నీరు కార్చారు. 'మోదీ జ్ఞాపకశక్తి అమోఘం' అని ఒక నేత చెప్పారు. 'కొత్త టీమ్ సమావేశం జరుగుతోంది సార్. మీరు వస్తే బాగుంటుంది అని నేనే ప్రధానికి చెప్పాను' అని జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ చెప్పారు. 'కెప్టెన్ ఆదేశిస్తే రాకుండా ఎలా ఉంటాను.. మీ అందర్నీ కలుసుకుంటే ఇంట్లో కుటుంబసభ్యుల మధ్య ఉన్నట్లుంటుంది' అని మోదీ నవ్వుతూ చెప్పారు. రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి వసుంధరా రాజే, సిద్ధాంతకర్తగా పేరొందిన రాంమాధవ్, సంస్థాగత ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్ తదితర ఉద్దండులు కూడా మోదీ మాట్లాడుతుంటే తదేకంగా వింటూ కూర్చున్నారు. సమావేశం తర్వాత వారందరితో పాటు గ్రూప్ ఫొటో దిగారు. కలిసి భోజనం చేశారు. ఆశ్చర్యకమైన విషయం ఏమంటే, ఈ కీలక సమావేశంలో హోంమంత్రి అమిత్ షా పాల్గొనలేదు. గతంలో జగత్‌ప్రకాశ్ నడ్డా అధ్యక్షుడు అయిన తర్వాత ఆఫీసు బేరర్లను నియమించినప్పుడు మోదీ ఇలాంటి అసాధారణమైన రీతిలో వ్యవహరించలేదు. ప్రధానమంత్రి కార్యాలయానికి వారందర్నీ పిలిపించుకుని గ్రూపుల వారీగా ఫొటోలు దిగి పంపించేశారు. ఈసారి మోదీ తానే పార్టీ కార్యాలయానికి వచ్చి పాల్గొన్న ఈ సమావేశం ద్వారా పంపించిన సందేశం ఏమిటి? అందరి పుట్టుపూర్వోత్తరాల్ని పరిశీలించిన తర్వాతే వారిని తానే ఎంపిక చేశానని, ఇది తన టీమ్ అని మోదీ అప్రకటితంగానే స్పష్టం చేశారు. ప్రభుత్వానికైనా, పార్టీకైనా తానే నాయకుడినని, తానే రెండింటినీ నడిపిస్తానని, రెండో వ్యక్తికి ఆ అవకాశం ఇవ్వనని చెప్పడం కూడా ఆయన ఉద్దేశం కావచ్చు. రానున్న రోజుల్లో వారికి బాధ్యతలు అప్పజెప్పే విషయంలో కూడా తన హస్తం ఉంటుందని ఆయన మాటల్లో పరోక్షంగా వ్యక్తం అయింది. గడచిన కొన్ని రోజులుగా దేశంలో జరుగుతున్న పరిణామాలను దృష్టిలో ఉంచుకుని పరిస్థితిని తన పూర్తి నియంత్రణలోకి తీసుకోవాలని నరేంద్రమోదీ నిర్ణయించినట్లు స్పష్టమవుతోంది. గత కొద్ది రోజులుగా ఆయన ఒక్కో కేంద్ర మంత్రిని పిలుచుకుని సుదీర్ఘంగా మాట్లాడుతున్నారు. త్వరలో మంత్రివర్గంలో భారీ మార్పులకు కూడా ఆయన రంగం సిద్ధం చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

ఇంతకీ.. పార్టీని, ప్రభుత్వాన్ని కొత్త రీతిలో, సైద్ధాంతికంగా పటిష్ఠం చేసే దిశలో మోదీ నడిపించదలుచుకున్నారా అన్నది ప్రశ్న. సైద్ధాంతికంగా ఆయన పార్టీ పదాధికారులకు చెప్పింది ఏమీ లేదు. దేశంలో ప్రస్తుత వివాదాలపై దృష్టి సారించకుండా వికసిత్ భారత్ పైనే ఆలోచించాలని చెప్పారు. ప్రజల్లోకి వెళ్లాలని, యువతను విశ్వాసంలోకి తీసుకోవాలని, నిరాడంబరంగా వ్యవహరించాలని, సోషల్ మీడియాపై దృష్టి సారించాలని ప్రోత్సహించారు. యథాప్రకారం ఆయన తన నాయకత్వాన్నే పార్టీ ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్దేశించారు. సెప్టెంబర్ 17న తన పుట్టిన రోజు సందర్భంగా నెల రోజుల పాటు సేవా సంకల్ప్ అభియాన్ పేరుతో ఉధృతంగా కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. అంతేకాదు, తాను గుజరాత్ ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా వేడుకలు జరుపుకోవాలని కూడా ఆయన నిర్ణయించారు.

బీజేపీ, కేంద్ర ప్రభుత్వం వ్యక్తి కేంద్రంగా ఎందుకు మారుతున్నాయి అన్న ప్రశ్నకు జవాబిచ్చే సిద్ధాంతకర్తలెవరూ ఆ పార్టీలో లేరు. పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ మోదీ తనను తాను కథానాయకుడిగా చిత్రించి అందరిలో ఆరాధనాభావం కల్పించాలని భావిస్తున్నట్లు మాత్రం స్పష్టమవుతోంది. పదాధికారుల సమావేశంలో బీజేపీ చేసిన ప్రధాన తీర్మానం వందేమాతర గీతం గౌరవాన్ని పరిరక్షించాలని నిర్ణయం తీసుకోవడం. వందేమాతర గీతాన్ని రెండు చరణాలు మాత్రమే పాడాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తీసుకున్న నిర్ణయాన్ని బీజేపీ పదాధికారుల సమావేశం తీవ్రంగా ఖండించింది.

అసలు వందేమాతర గీతం పూర్తిగా పాడాలనడం దేశంలో జనాన్ని కదిలించి బీజేపీ ఆశిస్తున్న సాంస్కృతిక జాతీయవాదానికి దారి తీస్తుందా అన్నది చర్చనీయాంశం. ప్రజల్లో, ప్రధానంగా నేటి జెన్‌జీ లో వందేమాతరం రెండు చరణాలకు పరిమితం కాకుండా పూర్తిగా పాడాలని చట్టం చేయడం ఎంత భావోద్వేగాన్ని కలిగిస్తుందనేది కూడా అంచనా వేయవలిసి ఉన్నది. చట్టం ద్వారా జాతీయ ఐక్యతను సాధించగలమా? అయినప్పటికీ ఇది బీజేపీ, కాంగ్రెస్‌ల మధ్య ఒక సైద్ధాంతిక వ్యత్యాసాన్ని స్పష్టం చేస్తుందనడంలో సందేహం లేదు. కానీ నిజంగా ఈ రెండు పార్టీలు ఈ సైద్ధాంతిక దృక్పథంలో లోతుగా ఆలోచించి నిజాయితీగా పనిచేస్తున్నాయా అన్నది కూడా ఆలోచించాల్సి ఉన్నది.

భారతీయ జనతా పార్టీకి సంబంధించి ఇది పోటీ పరీక్షల పత్రాల లీకేజీలు, విద్యార్థుల ఆందోళనలు, అయోధ్యలోని రామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టులోని ఆర్థిక అవకతవకల నుంచి దృష్టి మళ్లించడానికి ఉపయోగపడుతుందని వారు భావించవచ్చు. కానీ ఈ అంశాలను సజీవంగా ఉంచేందుకు కాంగ్రెస్ తీవ్రంగా యత్నిస్తోంది. విద్యార్థుల మీద హింసాకాండపై సుప్రీంకోర్టును కవచంగా ఉపయోగించుకుని ప్రభుత్వం సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి ఒకరి నేతృత్వంలోని కమిటీ ద్వారా సమస్య తీవ్రతను చల్లార్చేందుకు ప్రయత్నిస్తుంటే, పెల్లెట్ల ప్రయోగంపై ఎఫ్ఐఆర్ ఎందుకు దాఖలు చేయలేదని కాంగ్రెస్ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ పోలీస్ స్టేషన్‌లో హంగామా సృష్టించారు. అయోధ్య సంఘటనపై విమర్శలను ఎదుర్కొనేందుకు బీజేపీ వందేమాతర గీతం పూర్తిగా పాడాలంటూ చట్టం చేస్తే యూపీ కాంగ్రెస్ అధ్యక్షుడు అజయ్ రాయ్ నేరుగా అయోధ్యకు వెళ్లి హనుమాన్ ఘడీ వద్ద హనుమాన్ చాలీసా పఠించారు. మరోవైపు రాహుల్‌గాంధీ పూణేలో బీజేపీ మనువాద దృక్పథంతో వ్యవహరిస్తోందని విమర్శించారు.

కాంగ్రెస్ జాతీయవాదాన్ని, దేశభక్తిని ప్రశ్నార్థకంగా మార్చేందుకు బీజేపీ ప్రయత్నిస్తుంటే, కమలనాథులను నేటి యువతరానికి, సామాజిక న్యాయానికి వ్యతిరేకంగా చిత్రించేందుకు కాంగ్రెస్ శతవిధాలా ప్రయత్నిస్తోంది. కానీ రెండు పార్టీలకు జాతీయవాదం పట్ల స్పష్టత ఎంత ఉన్నదనేది చర్చనీయాంశం. నెహ్రూ రూపొందించుకున్న ఉదారవాద జాతీయవాదాన్ని సైద్ధాంతికంగా ప్రజల్లోకి తీసుకువెళ్లడంలో కాంగ్రెస్ ఎంతవరకు విజయవంతం అయింది? భారతదేశ గుర్తింపు మతపరమైన సిద్ధాంతంపై కాకుండా సాంస్కృతిక బహుళత్వంపై ఆధారపడి ఉంటుందని విశ్వసించిన నెహ్రూ భావజాలాన్ని కాలానుగుణంగా అన్వయించడంలో కాంగ్రెస్ విఫలమైందన్న విషయం విస్పష్టం. అదే సమయంలో సాంస్కృతిక జాతీయవాదాన్ని, సమగ్ర మానవతావాదాన్ని ప్రతిపాదించిన దీనదయాళ్ ఉపాధ్యాయ సిద్ధాంతానికి దూరంగా బీజేపీ పయనించడం ప్రారంభించి చాలా కాలమైంది. పూర్తి స్థాయి కార్పొరేటీకరణ, విదేశీ ఆర్థిక విధానాలకు భిన్నంగా స్వదేశీ ఆర్థిక సిద్ధాంతాన్ని రూపొందించుకోవాలని, కేంద్రీకృత పాలనను కాకుండా అన్నిస్థాయిల్లో వికేంద్రీకరణ జరపాలని, పొదుపుగా, నిరాడంబరంగా జీవిస్తూ రాజకీయాలను సేవగా మాత్రమే భావించాలని ఆయన చేసిన సూచనలను ఎంతమంది పాటిస్తున్నారు?ఈ రెండు పార్టీలూ ఎన్నికల రాజకీయాలకు అనుగుణంగా పావులు కదుపుతున్నాయే కానీ, తమ పార్టీల్లో సైద్ధాంతిక స్పష్టత కల్పించాలని తీవ్రంగా ప్రయత్నిస్తున్న దాఖలాలు కనపడడం లేదు. యూపీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని మనుస్మృతిని, కులగణనను లేవనెత్తేందుకు రాహుల్ యత్నిస్తుండవచ్చు. తద్వారా బహుజనులు, ఓబీసీల ఓట్లను కాంగ్రెస్ సాధించగలదా అన్నది ప్రశ్నార్థకం. బిహార్ ఎన్నికలకు ముందు కులగణనను ప్రధానాంశంగా చేసినప్పటికీ కాంగ్రెస్ తగిన సీట్లను సాధించలేకపోయింది.

**ఎడిటర్ చైతన్య**

## రాష్ట్ర ప్రగతిని అడ్డుకునేందుకు కుట్రలు

మొదటిపేజీ తరువాయి

**మంగళగిరి, ఆగస్టు 26 :**
రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులపై జగన్మోహన్ రెడ్డి ప్రెస్‌మీట్లు పెట్టి అభూత కల్పనలు, అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఎక్సైజ్, గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ధ్వజమెత్తారు. విపత్తులను ఎదుర్కొనే దూరదృష్టి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి మాత్రమే ఉందని స్పష్టం చేశారు. ఎల్ నినో, వర్షాభావ పరిస్థితులపై అసెంబ్లీలో చర్చ పెడితే వైసీపీ ఎమ్మెల్యేలు ముఖం చాటేశారని విమర్శించారు. గత ఐదేళ్ల పాలనలో రైతాంగానికి తీరని నష్టం వాటిల్లినా నాటి ప్రభుత్వం పట్టించుకోలేదని మండిపడ్డారు.

సాగునీటి రంగానికి ఊతం

గతంలో నిలిచిపోయిన సాగునీటి ప్రాజెక్టులను కూటమి ప్రభుత్వం వేగవంతం చేస్తోందని తెలిపారు. రాయలసీమ ప్రాజెక్టులకు దాదాపు 13,500 కోట్లు కేటాయించామని, హంద్రీ-నీవా, పట్టిసీమ, వెలిగొండ పనులను వేగవంతం చేసి రైతులకు నీరందిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో 36 ప్రాధాన్యతా ప్రాజెక్టులను 2029 నాటికి పూర్తి చేయడమే లక్ష్యమని స్పష్టం చేశారు.

బీసీల సంక్షేమానికి ప్రాధాన్యం

వైసీపీ పాలనలో బీసీ రిజర్వేషన్లను తగ్గించి అన్యాయం చేశారని, కూటమి ప్రభుత్వం రాజ్యసభ స్థానాల్లో 50 శాతం బీసీలకే ఇచ్చి గౌరవించిందని తెలిపారు. 16,347 పోస్టులతో మెగా డీఎస్సీ ప్రక్రియను చేపట్టి ఎన్నికల హామీలను నిలబెట్టుకున్నామని తెలిపారు. అసత్య ప్రచారాలు చేస్తే చూస్తూ ఊరుకోబోమని ఆయన హెచ్చరించారు.

## ప్రపంచస్థాయిలో అమరావతి నిర్మాణం: నాదెండ్ల మనోహర్

మొదటిపేజీ తరువాయి

గవర్నర్ ప్రసంగానికి ఉభయ సభలు కలిసేందుకు సెంట్రల్ హాల్, శాసన ప్రక్రియపై అవగాహన కోసం ఎక్స్‌పీరియన్స్ సెంటర్ నిర్మిస్తున్నట్లు వివరించారు.



పర్యావరణ హిత ప్రాంగణం

ప్రాంగణమంతా ఆహ్లాదకరంగా ఉండేలా అండర్‌గ్రౌండ్ పార్కింగ్ ఏర్పాటు చేసి, పైభాగంలో పచ్చదనంతో కూడిన గార్డెన్‌ను అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి సూచించారని తెలిపారు. ప్రజాప్రతినిధులకు మెరుగైన వసతులు, అత్యాధునిక సాంకేతికతతో కూడిన ప్రపంచస్థాయి శాసనసభ భవనాన్ని ప్రభుత్వం తీర్చిదిద్దుతోందని స్పష్టం చేశారు.

## ప్రజల ఆస్తులను రాత్రికి రాత్రే నిషేధిత జాబితాలో పెట్టారు:

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: ప్రజల ఆస్తులను రాత్రికి రాత్రే నిషేధిత జాబితాలో పెట్టారని, ప్రభుత్వమే ప్రజల ఆస్తుల పాలిట కబ్జాదారుగా మారిందని మాజీ మంత్రి హరీశ్‌రావు (ఋతీఅంష్ట తీఋశీ) విమర్శించారు. హైదరాబాద్ కూకట్‌పల్లిలో 22ఏ నిషేధిత భూముల బాధితులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ మంత్రి హరీశ్‌రావు మాట్లాడారు.

"గతంలో కేసీఆర్.. ప్రజలు కేంద్రంగా పాలన సాగించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం భూములు కేంద్రంగా పాలన సాగిస్తోంది. కేసీఆర్ సీఎం కాగానే.. ముందుగా ప్రజల సమస్యలపై దృష్టి సారించారు. తాగునీరు, విద్యుత్, హైదరాబాద్‌లో ట్రాఫిక్ వంటి సమస్యలపై దృష్టిపెట్టి పరిష్కరించారు. ప్రాజెక్టుల నిర్మాణంతో వరి దిగుబడిలో పంజాబ్‌ను అధిగమించి తెలంగాణ నంబర్‌వన్‌గా నిలిచింది. కేసీఆర్ ప్రతి ఆలోచన పేదల సంక్షేమం కోణంలోనే చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఎక్కడ భూములున్నా.. వెంటనే అమ్మేస్తోంది. రెండున్నరేళ్లలో రూ.30వేల కోట్ల విలువైన భూములు అమ్మారు. భవిష్యత్‌లో ప్రభుత్వ అవసరాలకు కూడా లేకుండా భూములు అమ్ముతున్నారు. ఇప్పుడు ప్రజల భూములను కూడా 22ఏలో చేర్చి ఇబ్బందిపెడుతున్నారు. ప్రజల నుంచి భూములు సేకరించి తన అనుచరులకు కట్టబెడుతున్నారు"అని ఆరోపించారు.

## జీసీసీల ఏర్పాటుకు హైదరాబాద్ తొలి ఎంపిక:

మొదటిపేజీ తరువాయి

మాదాపూర్: ప్రపంచస్థాయి కంపెనీలు గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల (జీసీసీ) ఏర్పాటుకు తొలి ఎంపికగా హైదరాబాద్‌ను ఎంచుకుంటున్నాయని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. గతేడాది రాష్ట్రంలోకి 75 జీసీసీలు వచ్చాయన్నారు. వచ్చే ఏడాది నాటికి మరో 100 సెంటర్లను తీసుకురావడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని తెలిపారు. ఆక్టేవ్ ఇంటెలిజెన్స్ సంస్థ హైటెక్ సిటీలో కొత్తగా ఏర్పాటు చేసిన గ్లోబల్ టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ సెంటర్‌ను బుధవారం మంత్రి శ్రీధర్‌బాబు ప్రారంభించి మాట్లాడారు. నగరంలో కేవలం ఐటీ మాత్రమే కాకుండా స్పోర్ట్స్ టెక్నాలజీ, మీడియా, హాస్పిటాలిటీ, క్యాపిటల్ మార్కెట్స్, ట్రేడింగ్, ఎనర్జీ వంటి విభిన్న రంగాలకు చెందిన కంపెనీలు ఏర్పాటు అవుతున్నాయన్నారు.

ఆక్టేవ్ సీఈవో మటియాస్ స్టైన్‌బర్గ్ మాట్లాడుతూ.. తమ సంస్థ తదుపరి వృద్ధి దశను కొనసాగించడానికి హైదరాబాద్ అన్నివిధాలా అనువైన ప్రదేశం అన్నారు. ప్రపంచస్థాయి ఇంజినీరింగ్ ప్రతిభ, శక్తివంతమైన టెక్నాలజీ ఎకో సిస్టమ్, బలమైన ఆవిష్కరణల సంస్కృతి.. హైదరాబాద్ సొంతమన్నారు. ఆక్టేవ్ ఇండియా ప్రొడక్ట్ అండ్ సర్వీసెస్ వైస్ ప్రెసిడెంట్ శేఖర్ కొనిదెన మాట్లాడుతూ.. ఇన్నోవేషన్ సెంటర్ కేంద్రంగా సాఫ్ట్‌వేర్, ఏఐ, డేటా, క్లౌడ్, ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ అంశాల్లో సేవలు, ఆవిష్కరణలు ఉంటాయన్నారు

## ఏడు రైలు మార్గాలు.. నాలుగు లైన్లుగా విస్తరణ: అశ్వినీ వైష్ణవ్

దేశంలో రద్దీ ఎక్కువగా ఉండే ఏడు కీలక రైలు మార్గాల అభివృద్ధిపై కేంద్రం దృష్టి సారించింది. ఈ మార్గాలను నాలుగు లైన్లుగా విస్తరిస్తున్నట్లు రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రకటించారు. దీనికి సంబంధించి 'ఎక్స్' వేదికగా ఆయన వివరాలు వెల్లడించారు. భవిష్యత్తులో పెరగనున్న ప్యాసింజర్, సరకు రవాణా డిమాండ్‌ను నెరవేర్చేందుకు, తక్కువ ట్రాన్స్‌పోర్ట్ వ్యయం, పర్యావరణహితమైన రైల్వే వ్యవస్థ ఏర్పాటుకు ఈ విస్తరణ కీలకమని పేర్కొన్నారు.

"దిల్లీ-హావ్‌డా, హావ్‌డా-చెన్నై, చెన్నై-ముంబయి, ముంబయి-దిల్లీ, దిల్లీ-చెన్నై, ముంబయి-హావ్‌డా, దిల్లీ-గువాహటి.. ఈ ఏడు రైలు మార్గాలు హైడెన్సిటీ నెట్‌వర్క్‌లో భాగం. ఇవి 11 వేల కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్నాయి. దేశ రైల్వే నెట్‌వర్క్‌లో వీటి వాటా 16 శాతంగానే ఉన్నప్పటికీ.. మొత్తం రైల్వే ట్రాఫిక్‌లో 41 శాతం రాకపోకలు ఈ మార్గాల్లోనే సాగుతున్నాయి. ఈ మార్గాల్లో ఇప్పటికే కొన్ని చోట్ల నాలుగు లైన్లు ఉన్నాయి. మొత్తం నెట్‌వర్క్‌ను నాలుగు లైన్లుగా విస్తరించడం ద్వారా ప్రయాణికులు, సరకు రవాణా సామర్థ్యం పెంపు సాధ్యమవుతుంది" అని అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు.

## సీజేపీ నిరసనల తర్వాత..

మొదటిపేజీ తరువాయి

దీని ఫలితం ఇన్‌స్టాగ్రామ్ లో కనిపించినట్లు 'డేటా బిగిన్స్' అనే సంస్థ నివేదికలు వెల్లడించాయి. ఈ సమయంలో ప్రధాని మోదీ, రాహుల్ గాంధీల ఇన్‌స్టా ఎంగేజ్‌మెంట్ రేట్స్ భారీగా పెరిగినట్లు తెలిపాయి. నిరసనలకు ముందు.. జులై 20 తర్వాత గణాంకాలను క్రోడీకరించి ఈ డేటాను వెలువరించాయి.

నివేదికల ప్రకారం.. ఇన్‌స్టాగ్రామ్‌లో మోదీ ఎంగేజ్‌మెంట్ రేట్ (అత్యధిక వ్యూస్, లైక్స్, షేర్స్, కామెంట్స్) 289.9శాతం పెరిగింది. ఆయన తర్వాతి స్థానంలో 180.7శాతంతో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నిలిచారు. నిర్ణీత సమయంలో వీరు వరుసగా వీడియోలు షేర్ చేయడంతో అగ్ర నేతల ఖాతాలకు ఆదరణ బాగా పెరిగినట్లు తెలుస్తోంది. వీరితో పాటు వీరి పార్టీ ఖాతాల వ్యూస్ సైతం పెరగడం గమనార్హం.

ఈ నిర్ణీత కాలంలో ప్రధాని నరేంద్ర మోదీ ఖాతాను ఎక్కువ మంది వీక్షించారు. దీంతో ఆయన ఒక్కో పోస్టుకు ఎంగేజ్‌మెంట్ 1,190,000 నుంచి 4,630,000లకు పెరిగింది. మునుపటి స్థాయి కంటే ఇది దాదాపు 3.9 రెట్లు ఎక్కువ. రాహుల్ గాంధీ ఖాతా వీక్షణల్లోనూ గణనీయమైన పెరుగుదల కనిపించింది. ఆయన సగటు ఎంగేజ్‌మెంట్ (×అఝుస్త్రతీఝుఎ వఅస్త్రఝుస్త్రవఎవత్) 1,52,000 నుంచి 4,26,000లకు పెరిగింది. యువతను ఆకట్టుకోవడానికి, రాజకీయ దృష్టిని ఆకర్షించడానికి ఇన్‌స్టాగ్రామ్ ప్రధాన సోషల్ మీడియా వేదికగా కొనసాగుతోంది.

## 'ఆ పరీక్ష ప్రశ్నపత్రాన్ని రూ.40 లక్షలకు అమ్మేశారు'..!

మొదటిపేజీ తరువాయి

"రాష్ట్రవ్యాప్త ఏజెంట్ల నెట్‌వర్క్ ద్వారా ఒక్కో ప్రశ్నపత్రాన్ని రూ.40 లక్షలకు అమ్మేసినట్లు నాకు సమాచారం అందింది. ఈ విషయం కమిషన్‌కూ తెలుసు. కానీ.. ఒక్క అభ్యర్థికే ఆ ప్రశ్నపత్రం అందినట్లు చెబుతోంది. ఇది కమిషన్ విశ్వసనీయతకు సంబంధించిన అంశం. కమిషన్ ఛైర్మన్ నైతిక బాధ్యత వహించి వెంటనే రాజీనామా చేయాలి" అని రోహిత్ పవార్ డిమాండ్ చేశారు. మరోవైపు.. ఈ వ్యవహారంపై తాను సీఎం దేవేంద్ర ఫడణవీస్‌ను కలిశానని భాజపా ఎమ్మెల్యే అభిమన్యు పవార్ తెలిపారు. ప్రశ్నపత్రం లీక్‌ను సీఎం తీవ్రంగా పరిగణించారని, సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని చెప్పారు.

పరీక్ష నిర్వహణకు ముందే ఒక అభ్యర్థికి ప్రశ్నపత్రం అందినట్లు పోలీసు విచారణలో ప్రాథమికంగా తేలిందని అంతకుముందు ఎంపీఎస్సీ వెల్లడించింది. ఈ అంశం తీవ్రతను పరిగణనలోకి తీసుకున్న అనంతరం నియామక ప్రక్రియను రద్దు చేయాలని నిర్ణయించినట్లు తెలిపింది. ఈ పరీక్ష రద్దు.. పేపర్ లీక్‌కు వ్యతిరేకంగా పోరాడుతున్న అభ్యర్థులకు దక్కిన విజయంగా కాంగ్రెస్ శాసనసభాపక్ష నేత విజయ్ వడెట్టీవార్ పేర్కొన్నారు.

## జనవరి 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా 'సంజీవని'

మొదటిపేజీ తరువాయి

**కుప్పం, చిత్తూరు ఫలితాలు**



కుప్పం, చిత్తూరు జిల్లాల్లో ప్రాజెక్టు అమలుతో అద్భుత ఫలితాలు వచ్చాయని అధికారులు సమీక్షలో వివరించారు. చిత్తూరులో హైపర్‌టెన్షన్ నియంత్రణ 56 శాతం, డయాబెటిస్ తీవ్రత 16 శాతం తగ్గాయని తెలిపారు. ప్రాథమిక వైద్య సేవల వినియోగం గణనీయంగా పెరిగిందని, సర్వేలో పాల్గొన్న 91 శాతం మంది ప్రజలు తమ ఆరోగ్యంపై అవగాహన పెరిగిందని తెలిపినట్లు పేర్కొన్నారు.

**ఏఐ ఆధారిత సేవలు**

స్క్రీనింగ్ నుంచి చికిత్స, ఫాలోఅప్ వరకు పూర్తిస్థాయి ఏఐ ఆధారిత ఆరోగ్య వ్యవస్థను రూపొందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ముందస్తు వ్యాధి గుర్తింపు, నివారణ, తక్కువ ఖర్చుతో కూడిన మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతామని తెలిపారు. ఈ సమీక్షలో మంత్రి సత్యకుమార్ యాదవ్, వైద్యారోగ్య శాఖ కార్యదర్శి వీరపాండియన్, అధికారులు పాల్గొన్నారు.

## 31న వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభం

మొదటిపేజీ తరువాయి

**మార్కాపురం, ఆగస్టు 26 :**
ఈ నెల 31న మూడు దశాబ్దాల వెలిగొండ ప్రాజెక్టు కల సాకారం కాబోతోందని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దీనిని ప్రారంభించనున్నారని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. మంగళవారం రాత్రి ఆయన ఫీడర్ కెనాల్ రెగ్యులేటర్ గేట్ల పనులతో పాటు ముఖ్యమంత్రి జలహారతి ఇచ్చే ఘాట్, సభా స్థలి ఏర్పాట్లను పరిశీలించారు. నిర్వాసితుల కాలనీలను సందర్శించి మౌలిక వసతులపై కలెక్టర్, అధికారులకు సూచనలు చేశారు. 7 వేల నిర్వాసిత కుటుంబాల త్యాగఫలితంగానే లక్షలాది ఎకరాలకు సాగునీరు, తాగునీరు అందుతోందని ఆయన కొనియాడారు.

నిర్వాసితులకు అండగా ప్రభుత్వం

గత ప్రభుత్వం ఐదేళ్లలో నిర్వాసితులకు ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా మోసం చేసిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 40 రోజుల్లోనే 768 కోట్లు చెల్లించిందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్లు పేర్కొన్నారు.

సొంతిళ్లు కట్టించే బాధ్యత

ముంపు గ్రామాల నిర్వాసితులకు రేషన్, పెన్షన్ వంటివి నిరంతరం అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. నిర్వాసిత కుటుంబాలు ఇళ్లు కట్టుకుని గృహప్రవేశాలు చేసే వరకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ విజయ సునీత, జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

## పార్టీ నేత కోరిక.. ఇంటి ఆడబిడ్డగా వధువు మెడలో తాళి కట్టిన కవిత

మొదటిపేజీ తరువాయి

కీసర: తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కవిత.. పార్టీ నాయకుడి ఇంటి ఆడబిడ్డగా మారారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కీసర పరిధి చీర్యాలలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన బాలప్రసాద్-శివాని వివాహాన్ని ఆమె చేతుల మీదుగా జరిపించారు. తన ఇంటి ఆడబిడ్డ హోదాలో పెళ్లి చేయాలని బాలప్రసాద్ కోరారు. వారి సామాజికవర్గ ఆచారం ప్రకారం వరుడు వధువుకు తాళి కట్టే ముందు ఆడపడుచు.. పసుపు కొమ్ముతో మూడుముళ్లు వేస్తారు. సంప్రదాయం ప్రకారం కవిత గౌరీ పూజలో పాల్గొని అనంతరం వధువు మెడలో పసుపు కొమ్ముదారంతో మూడుముళ్లు వేశారు. ఒడిబియ్యం పోసి పెళ్లి కుమార్తెను ఆశీర్వదించారు.

జన తెలంగాణ
తెలుగు దిన పత్రిక

గురువారం ఆగస్ట్ 27, 2026

# కీలక ఖనిజాల వైపు సింగరేణి పరుగులు

■నైనీ స్ఫూర్తితో.. దేవదుర్గపై ఫోకస్

**ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**

హైదరాబాద్ ఆగస్టు 26 జన తెలంగాణ

కర్ణాటకలోని దేవదుర్గ బంగారం, రాగి ఖనిజ బ్లాక్‌లో అన్వేషణ పనులను వేగవంతం చేయాలని సింగరేణి అధికారులను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశించారు. బుధవారం మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో సింగరేణి నూతన ప్రాజెక్టులు, భవిష్యత్ విస్తరణ ప్రణాళికలపై సంస్థ ఉన్నతాధికారులతో ఉప ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. కర్ణాటకలో సింగరేణి దక్కించుకున్న దేవదుర్గ బంగారం, రాగి ఖనిజ అన్వేషణ బ్లాక్‌పై ప్రత్యేకంగా చర్చించారు. సమావేశంలో సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాశ్ జ్యోతి, డైరెక్టర్లు సూర్యనారాయణ, వెంకటేశ్వర్లు, తిరుమలరావు తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. దేవదుర్గ బంగారం, రాగి ఖనిజ అన్వేషణ బ్లాక్‌పై క్షేత్రస్థాయిలో పరిస్థితులను స్వయంగా అధ్యయనం చేసేందుకు గురువారం సింగరేణి ఉన్నతాధికారులతో కలిసి దేవదుర్గ బ్లాక్‌ను సందర్శించనున్నట్లు తెలిపారు. ఖనిజ అన్వేషణకు అవసరమైన అనుమతులు, మౌలిక సదుపాయాలు, ఇతర అంశాల్లో కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారాన్ని తీసుకుంటామని ఆయన చెప్పారు. దేవదుర్గ ప్రాజెక్టును విజయవంతంగా ముందుకు తీసుకెళ్లడం ద్వారా బొగ్గు నుంచి కీలక, వ్యూహాత్మక ఖనిజాల రంగంలోకి సింగరేణి విస్తరణకు బలమైన పునాది పడుతుందని ఆయన చెప్పారు. మైనింగ్ రంగంలో సుదీర్ఘ అనుభవం ఉన్న సింగరేణి ఇకపై బొగ్గు తవ్వకాలకే పరిమితం కాకుండా కీలక, వ్యూహాత్మక ఖనిజాల అన్వేషణ, మైనింగ్ రంగాల్లోకి విస్తరించాలని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఇందుకు ప్రజా ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తుందని భరోసా ఇచ్చారు. తెలంగాణకు గుండెకాయలాంటి ప్రభుత్వ రంగ సంస్థ సింగరేణిని మరింత లాభదాయకంగా తీర్చిదిద్ది, భవిష్యత్ తరాలకు బలమైన సంస్థగా అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

**దేవదుర్గపై ప్రత్యేక దృష్టి:**



దేవదుర్గ బంగారం, రాగి ఖనిజ బ్లాక్‌లో ఇప్పటి వరకు చేపట్టిన పనులు, భౌగోళిక పరిస్థితులు, ఖనిజ నిక్షేపాల అన్వేషణకు చేపట్టాల్సిన తదుపరి చర్యలపై ఉప ముఖ్యమంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అన్వేషణ ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు అవసరమైన కార్యాచరణను రూపొందించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న పరిస్థితులను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు గురువారం సింగరేణి ఉన్నతాధికారుల బృందంతో కలిసి దేవదుర్గ బ్లాక్‌ను సందర్శించనున్నారు. ఖనిజ అన్వేషణ వేగవంతానికి అవసరమైన సహకారంపై కర్ణాటక ప్రభుత్వంతో చర్చించనున్నట్లు తెలిపారు. కీలక ఖనిజాల రంగంలో సింగరేణి విస్తరణకు దేవదుర్గ బ్లాక్‌ను ఒక కీలక అవకాశంగా మలచాలని అధికారులకు సూచించారు.

**అన్ని ఖనిజ వేలాల్లో పాల్గొనాలి:**

దేశీయంగానే కాకుండా అంతర్జాతీయ స్థాయిలోనూ సింగరేణి తన కార్యకలాపాలను విస్తరించాలని భట్టి విక్రమార్క సూచించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో జరిగే బొగ్గు, కీలక ఖనిజాల వేలం ప్రక్రియలను ఎప్పటికప్పుడు అధ్యయనం చేస్తూ, సింగరేణికి అనుకూలమైన ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని ఆదేశించారు. సింగరేణి ఇకపై కేవలం బొగ్గు మైనింగ్‌కే పరిమితం కాకుండా ఇతర ఖనిజాల మైనింగ్‌లోనూ తనదైన ముద్ర వేయాలని పేర్కొన్నారు. త్వరలో వనాడియం, టైటానియం వంటి కీలక ఖనిజ బ్లాక్‌లు వేలానికి వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో వాటిని దక్కించుకునేందుకు ఇప్పటి నుంచే సమగ్ర కార్యాచరణతో సిద్ధం కావాలని సూచించారు. ఇందుకు అవసరమైన అన్ని విధాల సహకారాన్ని ప్రజా ప్రభుత్వం అందిస్తుందని స్పష్టం చేశారు.ప్రపంచవ్యాప్తంగా ఇంధన, పారిశ్రామిక రంగాల్లో వస్తున్న మార్పులకు అనుగుణంగా కాపర్, గ్రాఫైట్, లిథియం, కోబాల్ట్ వంటి కీలక ఖనిజాల మైనింగ్ వైపు సింగరేణి అడుగులు వేయాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. భవిష్యత్తులో ఈ ఖనిజాలకు పెరగనున్న ప్రాధాన్యాన్ని దృష్టిలో పెట్టుకుని కొత్త అవకాశాలను గుర్తించాలని చెప్పారు. అంతర్జాతీయ స్థాయిలో ఖనిజ అవకాశాలను అధ్యయనం చేసేందుకు దక్షిణాఫ్రికా, బ్రెజిల్, ఆస్ట్రేలియా, చిలీ తదితర దేశాల్లోని అవకాశాల పరిశీలనకు అంతర్జాతీయ కన్సల్టెంట్లను నియమించినట్లు తెలిపారు. అంతర్జాతీయంగా అందుబాటులోకి వచ్చే అవకాశాలను పరిశీలించి సింగరేణికి ప్రయోజనకరమైన ప్రాజెక్టులపై ముందడుగు వేయాలని సూచించారు.

**డిమాండ్‌కు తగ్గట్టుగా బొగ్గు ఉత్పత్తి:**

ఒకవైపు కీలక ఖనిజాల రంగంలో విస్తరిస్తూనే మరోవైపు సంస్థ ప్రధాన కార్యకలాపమైన బొగ్గు ఉత్పత్తిపై ప్రత్యేక దృష్టి కొనసాగించాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో విద్యుత్ అవసరాలు పెరుగుతున్న నేపథ్యంలో డిమాండ్‌కు అనుగుణంగా బొగ్గు ఉత్పత్తిని పెంచేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో విద్యుత్, ఇంధన భద్రతకు మరింత ప్రాధాన్యం ఏర్పడిందని, ఈ విషయంలో సింగరేణి కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు. బొగ్గు ఉత్పత్తిలో అనుభవాన్ని ఉపయోగించుకుంటూనే, కీలక ఖనిజాల రంగంలోనూ సింగరేణిని దేశంలో అగ్రగామి సంస్థగా తీర్చిదిద్దేందుకు పటిష్ఠమైన కార్యాచరణతో ముందుకు సాగాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులకు దిశానిర్దేశం చేశారు.

## కన్నుల పండువగా తాపాల లక్ష్మీనరసింహస్వామి తిరుకల్యాణ మహోత్సవం..

కరీంనగర్ ఆగస్టు 26 జన తెలంగాణ




తిమ్మాపూర్ మండలం మహాత్మా నగర్ పరిధిలోని స్వయంభు శ్రీ శ్రీ శ్రీ తాపాల లక్ష్మీనరసింహస్వామి 22వ అధ్యయన బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవ వేడుకలను పురస్కరించుకుని బుధవారం రోజున స్వామివారి తిరుకల్యాణ మహోత్సవం నేత్రపర్వంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీ తిరునగరి విష్ణువర్ధన స్వామి, వేద పండితులు తిరునగిరి వెంకటాద్రి స్వామి నేతృత్వంలో స్వయంభు శ్రీ శ్రీ శ్రీ తాపాల లక్ష్మీనరసింహస్వామి తిరుకల్యాణ మహోత్సవం అత్యంత శాస్త్రోక్తంగా జరిగింది. ఈ దివ్య కల్యాణ మహోత్సవానికి చుట్టుపక్కల ప్రాంతాల నుండి, కరీంనగర్ జిల్లా నలుమూల నుండి అశేష సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. కల్యాణం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణతో పాటు, సామూహిక అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల కోసం ఆలయాన్ని విద్యుత్ కాంతులతో, పూలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం తలెత్తకుండా ఆలయ కమిటీ అధ్యక్షులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, పాలకవర్గ సభ్యుల ఆధ్వర్యంలో అన్ని సౌకర్యాలు కల్పిస్తూ భారీ ఏర్పాట్లు చేశారు.

## అల్ఫోర్స్ బాలుర రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో అలరించిన "త్రాలాల"

కరీంనగర్ ఆగస్టు 26 జన తెలంగాణ

■**సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు చాలా లాభాలు చేకూరుతాయి ప్రత్యేకంగా గుర్తింపు లభిస్తుంది.**

■**ప్రతి ఒక్కరూ లక్ష్యాలను ఏర్పాటు చేసుకోవాలి మరియు ఆ లక్ష్యాల వైపు అడుగులు వేయాలి.**

సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు ఒత్తిడి నుండి ఉపశమనం కలుగుతుందని మరియు చదువు పట్ల శ్రద్ధ వహిస్తారని తద్వారా వారు అనుకున్నటువంటి లక్ష్యాలను సైతం చాలా సులభంగా సాధిస్తారని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి గారు స్థానిక కొత్తపల్లి లోని అల్ఫోర్స్ బాలుర రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో



"త్రాలాల" పేరుతో ఏర్పాటు చేసినటువంటి ఫ్రెషర్స్ డే ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరై వారు మాట్లాడారు. ప్రారంభానికి ముందు వారు ప్రాంగణంలో ఏర్పాటు చేసినటువంటి సరస్వతి మాత విగ్రహానికి పూజా కార్యక్రమం నిర్వహించి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని విద్యార్థుల కేరింతల మధ్య వేడుకగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతంగా ఎదగడానికి అన్ని విధాలుగా ప్రోత్సాహం అందించాలని మరియు తల్లిదండ్రుల లక్ష్యాలను సైతం చేధించి ఉన్నత స్థానాలలో స్థిరపడాలని కోరారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో విద్యనభ్యసించినటువంటి విద్యార్థులు చాలా ప్రశంసనీయమైన ఽ గుర్తింపు పొందిన స్థానాల్లో ఉన్నారని దేశ విదేశాల్లో కూడా వారు చాలా గొప్పగా స్థిరపడడం అల్ఫోర్స్ చేసిన కృషికి గొప్ప ఫలితమని ఽ నిదర్శనమని వారు కొనియాడారు అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో విద్యార్థులకు అనేక సాంస్కృతిక కార్యక్రమాలను వివిధ సందర్భాల్లో నిర్వహించడం జరుగుతుందని చెప్పారువేడుకలలో భాగంగా విద్యార్థుల ప్రదర్శించినటువంటి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆలోచింపచేసాయి. ప్రత్యేకంగా నరసింహస్వామి కాన్సెప్ట్, రామ్ సియారామ్, జానపద నృత్యాలు, ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు

## పటేల్ పట్వారి విధానం వల్ల భూ సమస్యలు తక్కువగా ఉండేవి

వి. హనుమంతరావు

ప్రభుత్వ సలహాదారులుల

హైదరాబాద్ ఆగస్టు 26 జన తెలంగాణ

గత ప్రభుత్వం ప్రగతి భవన్ కట్టి ప్రజల సమస్యలను చెప్పుకోవడానికి అవకాశాలు ఇవ్వలేదు కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ప్రగతి భవన్ ను ప్రజా భవన్ గా మార్చి ప్రజా సమస్యల పరిష్కార కేంద్రంగా మార్చారు గాంధీ భవన్ కూడ ప్రజల సమస్యల పరిష్కార వేదిక అయ్యేలా ముఖాముఖీ కార్యక్రమం చేపట్టారనీ పేర్కొన్నారు నా దృష్టికి భూముల సమస్యలు ఎక్కువ వచ్చాయి పటేల్ పట్వారి విధానం వల్ల భూ సమస్యలు తక్కువగా ఉండేవి.కేసీఆర్ హయంలో ధరణితో పాటు అనేక సమస్యలు తీసుకోని వచ్చిందనీ తెలిపారు నాడు ఇందిరా గాంధీ పంచిన భూములు మళ్ళీ భూస్వాములు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారనీ రిజిస్ట్రేషన్ ఆఫీసులో తప్పిదాలు జరుగుతున్నాయి రెవెన్యూ శాఖ మంత్రి పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు

## జూబ్లీహిల్స్ JRC కన్వెన్షన్ లో మాజీ మంత్రి కాసు కృష్ణారెడ్డి మాతృమూర్తి శేషమ్మ దశదిన కర్మ కార్యక్రమానికి హాజరైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్ ఆగస్టు 26 జన తెలంగాణ



కాసు శేషమ్మ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించిన సీఎం

శేషమ్మ చిత్రపటానికి నివాళులు అర్పించిన ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యేలు జైవీర్ రెడ్డి, రాజేష్ రెడ్డి, నాగరాజు, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ కోటింరెడ్డి వినయ్ రెడ్డి, తదితరులు.

## స్కిల్లింగ్, అప్‌స్కిల్లింగ్, రీస్కిల్లింగ్‌లో భాగస్వామ్యం అవ్వండి

■**స్కిల్ క్యాపిటల్ గా తెలంగాణను తీర్చి దిద్దేందుకు కలిసి రండి**

■**పారిశ్రామికవేత్తలకు మంత్రి శ్రీధర్ బాబు పిలుపు**

హైదరాబాద్ ఆగస్టు 26 జన తెలంగాణ

తెలంగాణను స్కిల్ క్యాపిటల్‌గా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న స్కిల్లింగ్, అప్‌స్కిల్లింగ్, రీస్కిల్లింగ్ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పారిశ్రామికవేత్తలకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పిలుపునిచ్చారు. మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా పరిశ్రమలకు అవసరమైన 'రెడీ టూ వర్క్ ఫోర్స్'గా తెలంగాణ యువతను తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామన్నారు. బుధవారం బంజారాహిల్స్‌లోని తాజ్ కృష్ణాలో బోయింగ్, లెర్నింగ్ లింక్స్ ఫౌండేషన్ (ఎల్‌ఎల్‌ఎఫ్), సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్ (సీఐటీడీ) సంయుక్తాధ్వర్యంలో నిర్వహించిన 'బోయింగ్ స్కిల్లింగ్ ప్రోగ్రామ్'ను విజయవంతంగా పూర్తి చేసిన యువత, దివ్యాంగులు, వెటరన్స్ కు ఆయన ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ... టెక్నాలజీ, ఏఐ వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో పరిశ్రమలకు అవసరమైన








నైపుణ్యాలు కూడా ఎప్పటికప్పుడు మారుతున్నాయన్నారు. ఆ దిశగా యువతను తీర్చిదిద్దాలంటే ప్రభుత్వం, పరిశ్రమలు, పరిశోధనా సంస్థలు, నిపుణులు, విద్యా సంస్థలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. పరిశ్రమలు, విద్యా సంస్థల మధ్య అంతరాన్ని తగ్గించాలనే సంకల్పంతో రాష్ట్రంలో స్కిల్లింగ్ ఎకోసిస్టమ్‌ను బలోపేతం చేస్తున్నామన్నారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ద్వారా పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతకు నైపుణ్య శిక్షణ అందిస్తున్నామన్నారు. ఆధునిక, పరిశ్రమ ఆధారిత శిక్షణను అందించేందుకు ప్రభుత్వ ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. అకడమిక్ కరిక్యులమ్‌లో అవసరమైన మార్పులు, చేర్పులు చేయడంతో పాటు అనేక కొత్త కోర్సులకు శ్రీకారం చుట్టామన్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా రాష్ట్రంలో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను మరింత విస్తరించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ఇందుకోసం పరిశ్రమలు, పారిశ్రామికవేత్తలతో కలిసి పనిచేసేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. యువత తమ నైపుణ్యాలను నిరంతరం మెరుగుపర్చుకుంటూ భవిష్యత్ అవకాశాలను అందిపుచ్చుకోవాలని మంత్రి సూచించారు. కార్యక్రమంలో బోయింగ్, లెర్నింగ్ లింక్స్ ఫౌండేషన్, సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్ ప్రతినిధులు ప్రవీణ, యశోద, రష్మీ ప్రభ మిశ్రా, బితుపాన్ బోరా, రత్న శేఖర్ రెడ్డి, ఓం దేవ్, డా. విజయ్ కృష్ణ కాంత్ తదితరులు పాల్గొన్నారు.

## మిలాద్ ఉన్ నబీ వేడుకల్లో పాల్గొన్న బండి రమేష్

కూకట్పల్లి ఆగస్టు 26 జన తెలంగాణ



ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లో మిలాద్ ఉన్ నబీ పర్వదినాన్ని పురస్కరించుకుని ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అరవింద్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన వేడుకల్లో టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మరియు తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి రమేష్ ముస్లిం సోదరులకు మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు తెలియజేశారు. మహ్మద్ ప్రవక్త బోధించిన శాంతి, ప్రేమ, సోదరభావం, మానవత్వం వంటి గొప్ప విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని అన్నారు. సమాజంలో అన్ని మతాల ప్రజలు పరస్పర గౌరవం, ఐక్యతతో కలిసి మెలిసి జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మరియు మైనార్టీ నాయకులు దండుగుల యాదగిరి, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు ,మాకినేని వినోద్ ,కిరణ్ గౌడ్, నల్లోల్ల రాజేందర్, శివ యాదవ్, విజయ్ కాంత్ రెడ్డి, రాకేష్ గౌడ్, అంజద్, ముస్తఫా అలీ, ఆదిల్ పఠాన్, మున్ను, దీపక్, సతీష్ పటేల్, అస్లాం, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

## మిలాద్ నబీ బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించిన సైబరాబాద్ సీపీ

హైదరాబాద్ ఆగస్టు 26 జన తెలంగాణ

మిలాద్ నబీ సందర్భంగా నిర్వహించనున్న ఊరేగింపును దృష్టిలో ఉంచుకుని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్, జగద్గిరిగుట్ట, సూరారం పోలీస్ స్టేషన్‌ల పరిధిలోని ఊరేగింపు మార్గాన్ని పరిశీలించారు. ఊరేగింపు సాగే మార్గంలోని రహదారులు, ట్రాఫిక్ పరిస్థితులు, భద్రతాపరమైన అంశాలను పరిశీలించి, బందోబస్తు ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన సీపీ, పోలీసు అధికారులతో సమావేశమై మిలాద్ నబీ సందర్భంగా చేపట్టాల్సిన భద్రతా ఏర్పాట్లు, బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలను సమీక్షించారు. ఊరేగింపు ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా సజావుగా జరిగేలా ముందస్తు ప్రణాళికతో విధులు నిర్వహించాలని అధికారులను



ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. తదుపరి కుత్బుల్లాపూర్ జోన్ పరిధిలోని సీసీఎస్, ఎస్‌ఓటీ కార్యాలయాలను సీపీ సందర్శించి, ఆయా విభాగాల పనితీరు, భద్రతా అంశాలు మరియు పెండింగ్‌లో ఉన్న ముఖ్యమైన అంశాలపై అధికారులతో సమీక్షించారు. అనంతరం గాజులరామారం ప్రాంతంలో సైబరాబాద్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న పెట్రోల్ బంకు పనులను సీపీ పరిశీలించారు. పెట్రోల్ బంకు ఏర్పాటుకు సంబంధించిన ప్రస్తుత పరిస్థితి, మౌలిక వసతులు తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో సైబరాబాద్ పోలీస్ కార్ హెడ్‌క్వార్టర్స్ కోసం నూతనం గా ప్రభుత్వం కేటాయించిన స్థలాన్ని సీపీ పరిశీలించారు. అక్కడి పరిస్థితులను, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా చేపట్టాల్సిన అభివృద్ధి పనులను పరిశీలించి అధికారులతో చర్చించారు. ఈ పర్యటనలో కుత్బుల్లాపూర్ డీసీపీ ఎన్. కోటిరెడ్డి, కూకట్పల్లి డీసీపీ రితిరాజ్, ఎస్ ఓ టీ డీసీపీ శోభన్ కుమార్, సీ ఏ ఆర్ హెడ్ క్వార్టర్స్ డీసీపీ సంజీవ్, కుత్బుల్లాపూర్ అదనపు డీసీపీ పురుషోత్తం, ఏసీపీ పబాల గంగిరెడ్డి తదితర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

జన తెలంగాణ
తెలుగు దిన పత్రిక



# నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో డాక్టర్ బుసాని బాబు రావు వర్మ శతజయంతి ఉత్సవాల ప్రారంభ కార్యక్రమం

హైదరాబాద్ ఆగస్టు 26 జన తెలంగాణ
పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు కే.కేశవరావు , వి.హనుమంతరావు , మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ,బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, తదితరులు మంత్రి పొన్నం ప్రభాకర్.ప్రజాసేవ, సామాజిక న్యాయం, సామాజిక అభ్యున్నతికి విశేషంగా కృషి చేసిన డాక్టర్ బుసాని బాబు రావు వర్మ సేవలు అభినందనీయం ఎంతో ఆదర్శవంతమైనవి..ఆయన ప్రజా సేవా ప్రస్థానం, సమాజ అభివృద్ధికి చేసిన కృషి స్ఫూర్తిదాయకం.డాక్టర్ బుసాని బాబు రావు వర్మ శతజయంతి ఉత్సవాలు 2026 ఆగస్టు 26 నుంచి 2027 ఆగస్టు 26 వరకు నిర్వహిస్తున్న సందర్భంగా ప్రభుత్వం తరుపున నిర్వహించేలా చర్యలు తీసుకుంటామన్నారు..బాబురావు గారి సేవలు, పోరాట స్ఫూర్తి భావితరాలకు ఆదర్శం,సమాజంలో న్యాయం, సమానత్వం, అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడిన మహనీయుల చరిత్రను భావితరాలకు తెలియజేయడం మనందరి బాధ్యత.బాబురావు గారు సమాజ అభ్యున్నతి కోసం చేసిన సేవలు, పోరాటాలు చిరస్మరణీయం.వారి విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవడం ద్వారా వారి చరిత్రను, ఆశయాలను నేటి తరానికి గుర్తు చేయడంతో పాటు, రాబోయే తరాలకు కూడా స్ఫూర్తిని అందించినట్లవుతుంది. ప్రజల హక్కులు, సామాజిక న్యాయం కోసం పోరాడిన ప్రతి మహనీయుడి సేవలను ప్రభుత్వం గౌరవిస్తూ, వారి చరిత్రను భావితరాలకు పరిచయం చేయడానికి కృషి చేస్తుంది.బాబురావు గారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే వారికి మనం అందించే నిజమైన నివాళి.కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ రంగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# పెట్టుబడులను ఆకర్షించేలా ఇన్వెస్ట్ తెలంగాణ

- నిపుణులతో కమిటీల ఏర్పాటు

**ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**

హైదరాబాద్ ఆగస్టు 26 జన తెలంగాణ
తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2026-ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్ నిర్వహణలో భాగంగా ప్రజాభవన్‌లో తక్షణమే ప్రత్యేక వార్ రూమ్‌ను ఏర్పాటు చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్ కోసం అతిథులకు ఆహ్వాన పత్రాలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా త్వరగా పంపించే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. బుధవారం నాడు మహాత్మా పూలే ప్రజాభవన్ లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన మంత్రివర్గ ఉపసంఘం సమావేశమైంది. ఈ సమావేశంలో మంత్రులు



ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సహా పలువురు అధికారులు పాల్గొన్నారు. సీనియర్ అధికారి ఆధ్వర్యంలో ఈ వార్ రూమ్ పర్యవేక్షణ బాధ్యతలను సీఎస్ పటిష్టం చేయాలని సూచించారు. సమ్మిట్ కోసం ఏర్పాటు చేసిన వివిధ కమిటీలలో అవసరమైన నిపుణులను కీలక అధికారులను తీసుకోవలని ఆయన చెప్పారు. గతంలో జరిగిన గ్లోబల్ సమ్మిట్ సందర్భంగా కుదుర్చుకున్న అవగాహన ఒప్పందాల ప్రస్తుత పురోగతిపై సమగ్ర విశ్లేషణ చేసేందుకు ప్రత్యేకంగా కమిటీకి బాధ్యతలు అప్పగించాలన్నారు. డిసెంబర్ లో జరగనున్న సమ్మిట్ కోసం దేశీయంగా, అంతర్జాతీయంగా విస్తృతంగా రోడ్ షోలు నిర్వహించి పెట్టుబడిదారులను ఆకర్షించాలని చెప్పారు. ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్ కోసం అతిథులకు ఆహ్వాన పత్రాలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా త్వరగా పంపించే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. సమ్మిట్ పనుల పురోగతిపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రోజుకు కనీసం ఒక గంట కేటాయించి రోజువారీ సమీక్షలు నిర్వహించాలని, ప్రతి కమిటీకి కేటాయించిన బాధ్యతలను టైమ్‌లైన్ ప్రకారం పూర్తి చేయాలని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు.

# కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి ఏపీ వైపు నిండుగా పారుతున్న ఈ కుడి కాలువ నీళ్లే సాక్ష్యం!


- కేఆర్ఎంబీ అంటే లెక్క లేదు.. త్రిసభ్య కమిటీ అంటే విలువ లేదు.. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం అంటే ఏపీకి పట్టింపు లేదు
- చేతగాని సీఎం ఉంటే ఒక రాష్ట్రం ఎలా నష్టపోతుందో కృష్ణా జలాల విషయంలో జరుగుతున్న పరిణామాలే నిదర్శనం.
- నల్లగొండ జిల్లాలోని నాగార్జునసాగర్ ప్రాజెక్టుపై మరోసారి ఏపీ అధికారులు దౌర్జన్యానికి దిగడం సిగ్గుచేటు.
- -మాజీ మంత్రి,బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు

హైదరాబాద్ ఆగస్టు 26 జన తెలంగాణ
తెలంగాణ నీటిపారుదల శాఖ నిర్వహణలో ఉన్న సాగర్ డ్యామ్ నుంచి కేఆర్ఎంబీ అనుమతులు లేకుండానే ఏపీ వైపు కుడి కాలువకు నీటిని విడుదల చేసుకోవడం దౌర్జన్యం కాదా? అని వెల్లడించారు ఏపీ 47 టీఎంసీల నీటిని కోరింది. దీనిపై చర్చించి నిర్ణయం తీసుకోవాల్సిన త్రిసభ్య కమిటీ సమావేశమే వాయిదా పడింది. నీటి కేటాయింపులపై ఎలాంటి నిర్ణయం రాకముందే ఏపీ అధికారులు నీటిని తరలించడం ఏమిటి? అని పేర్కొన్నారు కేఆర్ఎంబీ అనుమతులు లేకుండా నీటిని తీసుకెళ్లేంత ధైర్యం ఏపీ అధికారులకు ఎలా వచ్చింది? ప్రశ్నించారు త్రిసభ్య కమిటీ నిర్ణయం కోసం కూడా వేచి చూడకుండా నీటిని తరలించే పరిస్థితి ఎందుకు వచ్చింది?
అడ్డుకోవాల్సిన కేఆర్ఎంబీ ఎందుకు మౌనంగా ఉంటోంది?
అసలు ఇంత జరుగుతుంటే తెలంగాణ నీటి హక్కులను కాపాడాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేస్తోంది?
ఒకవైపు శ్రీశైలం నుంచి వెలిగొండ టన్నెల్ ద్వారా 11 టీఎంసీల నీటిని తరలిస్తున్నారనీ ఆరోపించారు
ఇప్పుడు నాగార్జునసాగర్ కుడి కాల్వ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా నీటిని తరలిస్తున్నారు.ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు నెలకొన్న సమయంలో ఇలా ఇష్టారీతిన నీటిని తరలించడం దుర్మార్గం. అని తెలిపారు
ఇప్పటికే గత రెండేళ్లుగా కృష్ణా జలాల్లో తాత్కాలిక వాటాను సైతం వినియోగించుకోలేక మన నీళ్లను ఏపీకి ధారాదత్తం చేశారు.చరిత్రలో ఎన్నడూ లేనంత తక్కువ నీటి వినియోగం చేసి తెలంగాణకు తీరని ద్రోహం చేశారు. ఈ ఏడాది కూడా అదే తీరుగా వ్యవహరిస్తున్నారనీ తెలంగాణకు దక్కాల్సిన కృష్ణా జలాలను కాపాడాల్సిన సీఎం రేవంత్ రెడ్డి.. ఏపీ నీటి తరలింపును అడ్డుకోకుండా చోద్యం చూస్తున్నారు.కేఆర్ఎంబీని లెక్కచేయకుండా, త్రిసభ్య కమిటీని పట్టించుకోకుండా ఏపీ వ్యవహరిస్తుంటే.. తెలంగాణ ప్రభుత్వం ఎందుకు నోరు మెదపడం లేదు?
రాష్ట్ర ముఖ్యమంత్రిగా మీ మౌనం తెలంగాణ తాగు, సాగునీటి ప్రయోజనాలకు శాపంగా మారుతోందనీ మండిపడ్డారు ఇదే వైఖరిని కొనసాగిస్తే తెలంగాణ ప్రజల ముందు చరిత్రహీనుడిగా మిగిలిపోతావనీ తెలంగాణకు దక్కాల్సిన ప్రతి చుక్క నీటినీ కాపాడాలి.తెలంగాణ నీటి హక్కులను కాలరాస్తున్న ఏపీ నీటి తరలింపును అడ్డుకోవాలని డిమాండ్ చేస్తున్నాం.కిషన్ రెడ్డి కేంద్ర మంత్రిగా తెలంగాణ నీటి హక్కులను కాపాడాల్సిన బాధ్యత మీపై లేదా?ఏపీ నీటి అక్రమ తరలింపు విషయంలో ఖ=వీదీ పై ఒత్తిడి తీసుకువచ్చి తెలంగాణ నీటి హక్కులను కాపాడాలని డిమాండ్ చేస్తున్నాం. అన్నారు

# ప్రభుత్వ ఆస్తులను, భూములను అమ్ముకోవడమే కాంగ్రెస్ ప్రభుత్వ ఏకైక లక్ష్యం.

- ఇప్పటికే రూ.30 వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను తెగనమ్మిన రేవంత్ సర్కార్.
- హైదర్ నగర్‌లో పిల్లలు ఆడుకునే పార్కు స్థలాన్ని కూడా అమ్మకానికి పెట్టిన దుర్మార్గం.
- సామాన్యుల భూములను 22ఏలో పెట్టి వేధింపులు.. సీఎం బంధువులకు మాత్రం విలువైన ప్రభుత్వ ఆస్తులు దారాదత్తం.
- ఇలా భూములన్నీ అమ్ముకుంటే.. రేపు గుడి, బడి, ఆసుపత్రి, వైకుంఠధామానికి స్థలం ఎక్కడిది?
- కూకట్‌పల్లిలో 22ఏ బాధితులకు బీఆర్ఎస్ పక్షాన అండగా ఉంటామని హరీశ్ రావు భరోసా.

హైదరాబాద్ ఆగస్టు 26 జన తెలంగాణ
కూకట్‌పల్లి పరిధిలోని కేపీహెచ్‌బీ కాలనీ ఎన్ఆర్ఎస్‌ఏ కమ్యూనిటీ హాల్‌లో 22ఏ నిషేధిత భూముల సమస్యతో ఇబ్బంది పడుతున్న బాధిత కుటుంబాలతో మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీశ్ రావు సమావేశమయ్యారు. స్థానిక ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 22ఏ బాధితులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. బాధితుల ఆవేదనను స్వయంగా అడిగి తెలుసుకున్న హరీశ్ రావు.. కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి తీరుపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.
ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీశ్ రావు మాట్లాడుతూ..అసలు ఏ ఉద్దేశంతో ప్రభుత్వం ఈ 22ఏ ఆంక్షలను తీసుకొచ్చింది? ప్రభుత్వ బాధ్యత ఏమిటి? ప్రజలకు కావాల్సిన విద్య, వైద్యం, తాగునీరు, విద్యుత్, రవాణా, ఉద్యోగాలు, రైతుల సంక్షేమం కోసం పనిచేయాల్సిన ప్రభుత్వం.. ఆ సమస్యలను గాలికొదిలేసి కేవలం భూముల చుట్టూ ఎందుకు తిరుగుతోంది? అని పేర్కొన్నారు ఒక్క మాటలో చెప్పాలంటే.. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రజలే కేంద్రంగా పరిపాలన సాగింది. కానీ, రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత



కేవలం భూముల కేంద్రంగా పరిపాలన సాగుతోందన్నారు గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రాకముందు హైదరాబాద్‌తో సహా రాష్ట్రమంతా కరెంటు కష్టాలు ఉండేవి. తాగునీరు, ట్రాఫిక్, సాగునీటి సమస్యలతో ప్రజలు అల్లాడిపోయారు. కానీ, కేసీఆర్ అధికారంలోకి రాగానే వాటన్నింటినీ ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించారురాష్ట్రంలో ప్రతి ఇంటికి తాగునీరు, 24 గంటల ఉచిత విద్యుత్ అందించడంతో పాటు హైదరాబాద్ ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ఎన్నో ఫ్లైఓవర్లు నిర్మించారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచి, యువతకు ఉద్యోగాలు వచ్చేలా అద్భుతమైన ప్రగతిని సాధించారనీ పేర్కొన్నారు ఒకప్పుడు తెలంగాణ అంటే కరువు, రైతుల ఆత్మహత్యలు అనే పరిస్థితి ఉండేది. కానీ కేసీఆర్ గారి పాలనలో.. గోదావరి, గంగా నదీ పరివాహక ప్రాంతాల్లో ఉండి దేశంలోనే వరి ఉత్పత్తిలో నంబర్ వన్ స్థానంలో ఉన్న పంజాబ్, హర్యానా రాష్ట్రాలను సైతం తలదన్ని తెలంగాణను దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టారనీ కూకట్‌పల్లినే తీసుకుంటే.. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఇక్కడి తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు వందల కోట్ల రూపాయలు ఖర్చు చేశాం. పెద్ద పెద్ద రిజర్వాయర్లు, పైప్‌లైన్లు, మౌలిక వసతులు నిర్మించాం. అని నిజాం, బ్రిటిష్ కాలంలో కట్టిన ఉస్మానియా, గాంధీ ఆసుపత్రులపైనే ఆధారపడే పరిస్థితిని మార్చేసి.. నగర నలువైపులా టిమ్స్ ఆసుపత్రులు నిర్మించాం.ఒక్క కూకట్‌పల్లిలోనే 20కి పైగా బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేసి పేదలకు కార్పొరేట్ వైద్యాన్ని చేరువ చేశాం. అని వివరించారు కేసీఆర్ గారి ఆలోచనలన్నీ పేదల కోసం కళ్యాణలక్ష్మి, వృద్ధులకు ఆసరా పెన్షన్లు, ప్రభుత్వ ఆసుపత్రుల బలోపేతం, బస్తీ దవాఖానాలు, మిషన్ భగీరథ, 24 గంటల విద్యుత్, రైతాంగానికి సాగునీరు.. ఇలా సాగాయి. ఇవే బీఆర్ఎస్ పదేళ్ల సువర్ణ పాలనకు గుర్తులు.మరి ఈరోజు రేవంత్ రెడ్డి పాలనలో పరిస్థితి ఏమిటి? ప్రజల సమస్యలు పరిష్కరించడం కంటే, ప్రభుత్వ భూములను అమ్ముకోవడానికే ఈ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందనీ ఆరోపించారు హౌసింగ్ బోర్డు భూములు, టీజీఐఐసీ భూములు.. ఇలా ఎక్కడ ప్రభుత్వ స్థలం కనిపిస్తే అక్కడ బోర్డు పాతేసి అమ్మకానికి పెట్టడమే కాంగ్రెస్ విధానంగా మారిందనీ విమర్శించారు ప్రభుత్వ భూములు అంటే మన భవిష్యత్ తరాల ఆస్తి, అవి అమ్ముకోవడానికి కాదు. హైదర్ నగర్‌లో కిషన్ రావు అక్కడి కాలనీవాసులు పోరాడితే పిల్లలు ఆడుకోవడానికి కేసీఆర్ వెయ్యి గజాల స్థలాన్ని పార్కు కోసం కేటాయించారు. దుర్మార్గమైన రేవంత్ రెడ్డి సర్కార్ ఆ పార్కు స్థలాన్ని కూడా అమ్మకానికి పెట్టిందన్నారు బీఆర్ఎస్ పదేళ్ల ప్రభుత్వ హయాంలో హౌసింగ్ బోర్డుకు చెందిన ఒక్క గజం భూమిని కూడా అమ్మకానికి పెట్టలేదు. కానీ, రేవంత్ రెడ్డి రాగానే ఈ తక్కువ కాలంలోనే సుమారు రూ.30 వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను తెగనమ్మేశాడనిఇలా అడ్డగోలుగా భూములన్నీ అమ్ముకుంటూ పోతే.. రేపటి భవిష్యత్ తరాలకు ఒక దేవాలయం, మసీదు, చర్చి నిర్మించాలన్నా, ఆసుపత్రి, పాఠశాల, వాటర్ ట్యాంక్ కట్టాలన్నా.. కనీసం చనిపోతే దహన సంస్కారాలకు వైకుంఠధామం నిర్మించడానికి కూడా స్థలం దొరకని పరిస్థితి వస్తుందనీ అన్నారు ఒకవైపు ప్రభుత్వ భూములను అమ్మకానికి పెడుతూనే, మరోవైపు దళితులు, గిరిజనులు, బీసీ వర్గాలకు గతంలో కేటాయించిన అసైన్డ్ భూములపై కన్నేశారులక్షలాది మంది పేదలకు భరోసాగా ఉన్న ఆ భూములను లాక్కొని దళారుల ద్వారా కమీషన్లకు కట్టబెడుతున్నారనీ కష్టపడి పైసా పైసా కూడబెట్టుకుని కొనుక్కున్న సామాన్యుల భూములను మాత్రం రాత్రికి రాత్రే 22ఏ నిషేధిత జాబితాలో పెట్టి ప్రజలను వేధిస్తున్నారనీ మండిపడ్డారు కానీ, ప్రభుత్వ ఆస్తులైన అత్యంత విలువైన భూములను మాత్రం సీఎం తన కుటుంబ సభ్యులకు, అనుయాయులకు కారుచౌకగా దారాదత్తం చేస్తున్నారు.ఈ ప్రజా వ్యతిరేక విధానాలను బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోంది. 22ఏ బాధితుల పక్షాన, సామాన్యుల ఆస్తుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ ప్రభుత్వ మెడలు వంచైనా సరే రాజీలేని పోరాటం చేస్తాం. అని తెలిపారు

# రూ. 2.50 లక్షల గంజాయి పట్టివేత..

**5 కిలోల గంజాయి స్వాధీనం.**

**ఒక్కరు అరెస్టు.**

హైదరాబాద్ ఆగస్టు 26 జన తెలంగాణ



బుధవారం తెల్లవారు జామున స్టేట్ టాస్క్ ఫోర్స్ ఆా, దీ టీమ్స్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ లు ఫయాజ్, విష్ణుమూర్తి ఆదేశాల మేరకు, టాస్ఫోర్స్ సిఐలు ఎం.పి.ఆర్ చంద్రశేఖర్, బిక్షారెడ్డి ఆధ్వర్యంలో మేడ్చల్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని గుండ్లపోచంపల్లి శివారులో మలీబు రెస్టారెంట్ ఎదురుగా నాగపూర్ నుంచి హైదరాబాద్ కు వచ్చె ట్లావెల్ బస్సుల్లో అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్నారన్న సమాచారం మేరకు బస్సులలో వచ్చె పాసెంజర్ లను తనిఖీలు నిర్వహించారు.ఈ దాడిలో మొహమ్మద్ ఖాదర్, 46 ఇస్లాంపూర్, ఇచ్చోడ, ఆదిలాబాద్ అనే వ్యక్తి వద్ద 5 కిలోల ఎండు గంజాయి ఐదు పాకెట్లలో పాక్ చేసి హాండ్ బ్యాగ్ లో ఉండగా స్వాధీన స్వాధీనం చేసుకున్నారు.గంజాయి నిందితుడు అరెస్ట్ చేసి విచారించగా, తను గోల్కొండ కు చెందిన మొహమ్మద్ కు సరఫరాచేసి ఇద్దరం కలిసి విక్రయిస్తామని తెలిపినాడు. నాగపూర్ లో రెండువేలకు కిలోచొప్పున ఒరిస్సా రాష్ట్రానికీ చెందిన అపరిచిత వ్యక్తుల వద్ద కొనుగోలుచేసి హైదరాబాద్ లో 50 గ్రాముల పాకెట్ ను 500 రూపాయలకు విక్రయిస్తున్నట్టు ఎక్సైజ్ విచారణలో మొహమ్మద్ ఖాదర్ తెలిపినాడు. స్వాదీనపరుచున్న ఐదు కిలోల గంజాయిని, మొహమ్మద్ ఖాదర్ ను ఎక్సైజ్ స్టేషన్ మేడ్చల్ నందున అప్పచెప్పడం జరిగింది. ఈ దాడుల్లో సిఐలు ఎం.పి.ఆర్ చంద్రశేఖర్ , బిక్షారెడ్డి లతో పాటు ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ ఎస్సైలు బాల్ రాజ్, సాయికిరణ్ రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

# రూ. 2 లక్షల విలువ చేసే డిఫెన్స్ మద్యం పట్టివేత..

**కర్ణాటక హర్యానా డిఫెన్స్ బాటిల్స్ గా గుర్తింపు..**

**67 డిఫెన్స్ మద్యం బాటిల్ స్వాధీనం..**

హైదరాబాద్ ఆగస్టు 26 జన తెలంగాణ



హైదరాబాద్ ఎన్ఫోర్స్మెంట్ టీం సీఐ చంద్రశేఖర్ గౌడ్ ఇతర సిబ్బంది కలిసి తార్నాక ప్రాంతంలో ఒక వ్యక్తి వద్ద పది మద్యం బాటిల్లను స్వాధీనం చేసుకున్నారు.నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ బాటిల్స్ గా గుర్తించి ఆ బాటిల్స్ వివరాలను సేకరించారు.

**మద్యం బాటిల్లను అమ్మకాలు జరుపుతున్న ఆర్ మాధవన్ మాజీ సైనికుని కొడుకు.**

హైదరాబాదులో ఉంటూ వివిధ రాష్ట్రాల నుంచి డిఫెన్స్ మద్యం బాటిల్లను తీసుకొని వచ్చి హైదరాబాదులో అమ్మకాలు జరుపుతున్నట్లు గుర్తించారు.నిందితుడు ఇంట్లో మరో 57 మద్యం బాటిల్లు మొత్తం 67 మద్యం బాటిల్ లను స్వాధీనం చేసుకున్నారు.వీటి విలువ రూ. 2 లక్షలు గా ఉంటుందని అంచనా వేశారు.100 పేపర్స్, అమృత్, టీచర్స్ ఇతర మద్యం బాటిల్లు ను పరిశీలించగా కర్ణాటక, హర్యానా ప్రాంతాలకు చెందిన డిఫెన్స్ బాటిల్స్ గా ఉన్నట్లు విచారణలో వెల్లడయింది.మద్యం బాటిల్లను అమ్మ కాలు జరుపుతున్న నిందితుడు మాధవన్ సికింద్రాబాద్ ఎక్సైజ్ స్టేషన్లో అప్పగించినట్లు సిఐ చంద్రశేఖర్ తెలిపారు.ఈ దాడిలో ట్రేని ఏఈ ఎస్ చిరంజీవి, హెడ్ కానిస్టేబుల్ అఫ్జల్, కానిస్టేబుల్ శశిధర్ శేఖర్ జంగయ్య లు పాల్గొన్నారు.

# 1.960 కేజీల గంజాయి పట్టివేత..

హైదరాబాద్ ఆగస్టు 26 జన తెలంగాణ



ఘట్కేసర్ ఎన్ ఎఫ్ సి నగర్, ప్లాట్ నెంబర్ 177 ఎస్పీ శ్రీనివాస కాలనీలో గంజాయి అమ్మకాలు జరుగుతున్నాయని సమాచారం మేరకు ఘట్కేసర్ సీఐ రవి సిబ్బంది కలిసి దాడి నిర్వహించారు.ఈ దాడిలో మాధవ్ నిఖిల్ నిఖిల్ (23) అనే యువకుడు వద్ద 1. 960 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు మాధవ్ నిఖిల్ తో పాటు ఒక టూ వీలర్ సెల్ఫోన్లను కూడా స్వాధీనం చేస్తే కేసు నమోదు చేశారు నట్లు సీఐ రవికుమార్ తెలిపారు.

# మిలాద్-ఉన్-నబి కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్

హైదరాబాద్ ఆగస్టు 26 జన తెలంగాణ



నిజామాబాద్ నగరంలోని ఖిల్లా రోడ్‌లో జూబ్లీ హోటల్ వద్ద నిర్వహించిన మిలాద్-ఉన్-నబి కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు.
ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ...ప్రవక్త మహమ్మద్ చూపిన శాంతి, సోదరభావం, మానవతా విలువలు సమాజానికి ఆదర్శమని ఆయన పేర్కొన్నారు.తెలంగాణలో అన్ని వర్గాల ప్రజలు సుఖశాంతులతో, సోదరభావంతో జీవించాలని ఆకాంక్షించారు. మత సామరస్యం, పరస్పర గౌరవం, ఐక్యతను మరింత బలోపేతం చేయడమే సమాజ అభివృద్ధికి దోహదపడుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, ముస్లిం మత పెద్దలు, కార్యకర్తలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

జన తెలంగాణ
తెలుగు దిన పత్రిక
గురువారం ఆగస్ట్ 27, 2026

# చికెన్, మటన్ మానేసి.. భోజనం మధ్య 14 గంటల గ్యాప్ ఉంటే..

## షుగర్ వచ్చే ఛాన్స్ తక్కువంట




**షుగర్.. అందరినీ భయపెడుతున్న దీర్ఘకాలిక ఆరోగ్య సమస్య.**
**ఔనూ లెక్కల ప్రకారం ప్రపంచంలో 83 కోట్ల మంది షుగర్ బాధితులు.**
**భారతదేశంలో 18 ఏళ్లు నిండిన వారు 7.7 కోట్ల మంది షుగర్ తో బాధితులు.**
**మరోవైపు 2.5 కోట్ల మంది ప్రీ డయాబెటిస్ దశలో ఉన్నారు.**
**తమకు డయాబెటిస్ ఉన్నది తెలియనివారు 50% మంది ఉన్నారు: ఔనూ**




### పరిశోధనలో ప్రధాన విషయాలు



దేశంలోని అనేక ప్రాంతాల్లోని రీసెర్చ్ సెంటర్లలో ఓపెన్ లేబుల్ ట్రయల్స్ నిర్వహించారు.
టైప్ 2 డయాబెటిస్ ఉన్న 25 నుండి 60 ఏళ్ల వయసున్న 96 మంది మహిళలపై రీసెర్చ్ చేశారు.
వీరికి డయాబెటిస్ చికిత్స లేకుండా 14 గంటల గ్యాప్‌తో కూరగాయల భోజనం ఇచ్చారు.
96 మందిలో 90 మంది మహిళలు 24 వారాల అధ్యయనంలో పాల్గొన్నారు.
ఆహార వివరాలు
మటన్, చికెన్, చేపలు, గుడ్డు వంటి నాన్ వెజ్ మినహాయింపు.
కూరగాయలు, పండ్లు, పప్పులు, పాల ఉత్పత్తులు, తృణధాన్యాలు, పీచు పదార్థాలు ఉన్న ఆహారం ఇచ్చారు.
14 గంటల గ్యాప్ విధానం
ప్రతి రోజూ 10 గంటల వ్యవధిలోనే ఆహారం ఇచ్చారు.
ఉదయం 9 గంటల నుండి రాత్రి 7 గంటల మధ్య భోజనం.
రాత్రి 7 గంటల నుండి మరుసటి రోజు ఉదయం 9 గంటల వరకు అంటే 14 గంటలు ఎటువంటి ఆహారం ఇవ్వలేదు.
పరిశోధన ఫలితాలు
ప్రయోగం ముగిసే సమయానికి --
చికిత్స తీసుకుంటున్న వారిలో ఎహెూ1ఎ లెవెల్స్: 7.65%
పరిశోధనలో పాల్గొన్న మహిళలలో ఎహెూ1ఎ లెవెల్స్: 6.53%
రెండింటి మధ్య వ్యత్యాసం: 1.12 శాతం పాయింట్లు.

**టైప్ 2 డయాబెటిస్‌పై మానవ జన్యుశాస్త్ర పరిశోధకులు అనూభ మహజన్ టీం పరిశోధన.**
**రోజూ లాక్టో వెజిటేరియన్ ఆహారం తీసుకుంటూ 14 గంటల రాత్రిపూట గ్యాప్ ఉంటే రక్తంలో గ్లూకోజ్ లెవెల్స్ కంట్రోల్‌లో ఉన్నాయని తేలింది.**
**24 వారాల రీసెర్చ్‌లో డయాబెటిస్‌కు చికిత్స తీసుకుంటున్న వారితో పోలిస్తే,**
**చికెన్, మటన్ తినకుండా వెజిటేరియన్ ఫుడ్ తీసుకున్న వారిలో ఎహెూ1ఎ లెవెల్స్ కంట్రోల్‌లో ఉన్నాయని.**



# తియ్యటి బంధం.. కమ్మటి భోజనం

రక్షా బంధనం రోజున అన్నదమ్ములు ఇంటికి వస్తున్నారా? ప్రేమగా రాఖీ కట్టి, ఆ చేత్తోనే కమ్మటి భోజనం వడ్డించండి. చిన్ననాటి ఊసులు కలబోసుకుంటూ, ఆనందంగా అందరూ కలిసి ఆరగించండి. మీ మెనూ ఇలా ఉందంటే.. ఎక్కువ ప్రయాస లేకుండా వేగంగా వంట పూర్తవుతుంది.

**గోబీ 65**

కావలసినవి: క్యాలీఫ్లవర్ – 1, మైదా, మొక్కజొన్నపిండి – అర కప్పు చొప్పున, బియ్యప్పిండి, పెరుగు – 2 టేబుల్ స్పూన్ల చొప్పున, ధనియాల పొడి, సాధారణ కారం, కశ్మీరీ కారం – స్పూన్ చొప్పున, గరంమసాలా, జీలకర్ర పొడి – అర స్పూన్ చొప్పున, అల్లం వెల్లుల్లి పేస్ట్, నిమ్మరసం – టేబుల్ స్పూన్ చొప్పున, ఉప్పు – తగినంత, ఫుడ్ కలర్ – కొద్దిగా, నూనె – వేయించడానికి సరిపడా
తాలింపు: వెల్లుల్లి తరుగు, నూనె – టేబుల్ స్పూన్ చొప్పున, పచ్చిమిర్చి – 3, కరివేపాకు – 2 రెమ్మలు, ఎండుమిర్చి – ఒకటి
తయారీ: కడిగిన క్యాలీఫ్లవర్‌ను చిన్న పూలుగా విడదీయాలి. మైదా, మొక్కజొన్నపిండి, బియ్యప్పిండి, తగినన్ని నీళ్లు, రెండు రకాల కారాలూ, గరంమసాలా, ధనియాలు, జీలకర్ర పొడర్లు, అల్లం వెల్లుల్లి పేస్ట్, నిమ్మరసం, పెరుగు, ఉప్పు వేసి కలపాలి. పిండి మరీ పలుచగా ఉండకూడదు. ఇందులో క్యాలీఫ్లవర్ పూలు వేసి అన్నిటికీ పిండి సమానంగా పట్టేలా కలపాలి. కడాయిలో నూనె వేడిచేసి.. వీటిని మధ్యస్థమైన సెగ మీద బంగారు రంగులోకి మారే వరకూ వేయించాలి. మరో ప్యాన్‌లో టేబుల్ స్పూన్ నూనె వేడిచేసి.. ఎండుమిర్చి, కరివేపాకు, వెల్లుల్లి తరుగు, పచ్చిమిర్చి వేసి.. మంచి వాసన వచ్చే వరకూ వేయించాలి. ఇప్పుడు వేయించిన గోబీని ఇందులో వేసి.. నిమిషం తర్వాత సెగ తీసేస్తే సరిపోతుంది. బియ్యప్పిండి వేయడం వల్ల కరకరలాడతాయి. నూనె తగినంత వేడిగా ఉన్నప్పుడే గోబీ వేయించాలి. లేకుంటే సరిగ్గా వేగదు, ఎక్కువ నూనె పీల్చుకుంటుంది.

**రోజ్ ఫాలూదా**

**కావలసినవి: ఫలూదా సేవ్ - 2 కప్పులు, పాలు - 4 కప్పులు, రోజ్ సిరప్ - కప్పు, పంచదార - పావు కప్పు, సబ్జా గింజలు - రెండు టేబుల్ స్పూన్లు, వెనీలా ఐస్ క్రీమ్ - కప్పున్నర, టూటీ ఫ్రూటీ - కొద్దిగా, బాదం పిస్తా పలుకులు - మూడు టేబుల్ స్పూన్లు, పండ్ల ముక్కలు - గుప్పెడు**
తయారీ: పాలను కాచి చల్లార్చాలి. సబ్జా గింజలను నీళ్లలో వేసి నాననివ్వాలి. ఫాలూదా సేవ్‌ను మరుగుతున్న నీళ్లలో వేసి మెత్తగా ఉడికించి.. ఆ నీళ్లు వడకట్టాలి. చల్లారిన పాలలో రోజ్ సిరప్, పంచదార వేసి కలపాలి. సర్వింగ్ గ్లాసుల్లో టూటీ ఫ్రూటీ, ఫాలూదా సేవ్ వేయాలి. తర్వాత నానిన సబ్జా గింజలు, పాలు జత చేయాలి. ఇప్పుడు వెనీలా ఐస్ క్రీమ్ వేసి.. పైన పండ్ల ముక్కలు జోడించాలి. చివరగా డ్రైఫ్రూట్స్ పలుకులు చల్లి.. ఐస్ క్యూబ్స్ వేస్తే రుచికరమైన ఫాలూదా సిద్ధం.

**షాహీ పులావ్**

కావలసినవి: బాస్మతి బియ్యం – 2 కప్పులు, నూనె, నెయ్యి – 2 టేబుల్ స్పూన్ల చొప్పున, ఉల్లి తరుగు – పావు కప్పు, అల్లం వెల్లుల్లి పేస్ట్, జీలకర్ర, పంచదార, నిమ్మరసం – స్పూన్ చొప్పున, పచ్చిమిర్చి – 2, షాజీరా – అర స్పూన్, దాల్చినచెక్క – అంగుళం ముక్క, లవంగాలు, యాలకులు – 4 చొప్పున, బిర్యానీ ఆకు, స్టార్‌మొగ్గ – ఒక్కొకటి, ఉప్పు – తగినంత, కుంకుమపువ్వు – కొద్దిగా, పాలు – రెండు టేబుల్ స్పూన్లు, పచ్చి బఠాణీలు, క్యారెట్, క్యాలీఫ్లవర్, బీన్స్ ముక్కలు – అర కప్పు చొప్పున, బాదం, జీడిపప్పు – పావు కప్పు చొప్పున, పిస్తా, ఎండుద్రాక్ష – రెండు టేబుల్ స్పూన్ల చొప్పున
తయారీ: బియ్యం కడిగి నానబెట్టాలి. కుంకుమపువ్వును పాలలో వేసి పక్కనుంచాలి. కుక్కర్‌లో నూనె వేడిచేసి.. దాల్చినచెక్క, బిర్యానీ ఆకు, స్టార్‌మొగ్గ, యాలకులు, జీలకర్ర, షాజీరా, లవంగాలు, బాదం, పిస్తా, జీడిపప్పు, ఎండుద్రాక్షలను వేయించాలి. అందులో ఉల్లి తరుగు, అల్లం వెల్లుల్లి పేస్ట్, కూరగాయల ముక్కలు వేసి కలియబెడుతుండాలి. రెండు మూడు నిమిషాల తర్వాత నానిన బియ్యం, తగినన్ని నీళ్లు, ఉప్పు, పంచదార, నిమ్మరసం, కుంకుమపువ్వు కలిపిన పాలు, నెయ్యి చేర్చి.. మూత పెట్టి రెండు విజిల్స్ వచ్చే వరకూ ఉడికించాలి. అంతే.. 'షాహీ పులావ్' రెడీ. ఇక బూందీ రైతాతో వడ్డించారంటే అద్దిరిపోతుంది.

**పిస్తా బర్ఫీ**

కావలసినవి: పిస్తా పప్పులు – 2 కప్పులు, పిస్తా పలుకులు – 2 టేబుల్ స్పూన్లు, పంచదార పొడి – కప్పు, మిల్క్ పౌడర్ – అర కప్పు, పాలు – పావు కప్పు, నెయ్యి – 2 టేబుల్ స్పూన్లు, యాలకులపొడి – అర స్పూన్, కుంకుమపువ్వు – చిటికెడు, రోజ్‌వాటర్ – స్పూన్
తయారీ: కుంకుమపువ్వులో రెండు స్పూన్ల వెచ్చని పాలు పోసి పక్కనుంచాలి. పిస్తాపప్పులను 2 గంటలు వేడినీళ్లలో నానబెట్టి, పై పొట్టు తీసేయాలి. తడి లేకుండా ఆరబెట్టి, మెత్తగా గ్రైండ్ చేయాలి. ప్యాన్‌లో నెయ్యి వేడిచేసి.. సన్న సెగ మీద పిస్తా పొడిని కొద్దిగా వేయించాలి. అందులో మిల్క్ పౌడర్, పంచదార పొడి జతచేసి కలియబెట్టాలి. తర్వాత కొద్దికొద్దిగా పాలు పోస్తూ.. ఉండలు కట్టకుండా నిరంతరం కలుపుతుండాలి. నాలుగైదు నిమిషాల తర్వాత.. కుంకుమపువ్వు వేసిన పాలు, యాలకులపొడి, రోజ్‌వాటర్ జోడించి, కలియబెడుతూనే ఉండాలి. మిశ్రమం ప్యాన్ అంచుల నుంచి విడిపోతున్నప్పుడు.. స్టవ్ ఆఫ్ చేసి, నెయ్యి రాసిన పళ్లెంలో సమంగా సర్దాలి. పైన పిస్తా పలుకులు చల్లి.. మెల్లగా నొక్కితే అంటుకుంటాయి. ఇప్పుడు నచ్చిన ఆకృతిలో ముక్కలుగా కట్ చేసుకోవాలి. పిస్తాపప్పులను ఎక్కువగా వేయిస్తే.. వాటి రంగు తగ్గడమేగాక బర్ఫీ రుచి కూడా మారుతుంది. పిస్తాలను ఏకబిగిన గ్రైండ్ చేయకుండా పల్స్ చేయాలి. మిశ్రమాన్ని మరీ ఎక్కువసేపు ఉడికిస్తే బర్ఫీ గట్టిపడిపోతుంది.



**చీజ్ పరోటా**

కావలసినవి: గోధుమపిండి – 2 కప్పులు, ఉప్పు – తగినంత, నూనె – టేబుల్ స్పూన్, నెయ్యి – 3 టేబుల్ స్పూన్లు, చీజ్ – కప్పున్నర, ఉల్లి, క్యాప్సికమ్ తరుగు – పావు కప్పు చొప్పున, పచ్చిమిర్చి – 1, కొత్తిమీర – గుప్పెడు, చిల్లీఫ్లేక్స్ – స్పూన్, మిరియాల పొడి, ఛాట్ మసాలా, అల్లం తురుము, వామాకు పొడి – అర స్పూన్ చొప్పున
తయారీ: గోధుమపిండిలో తగినన్ని నీళ్లు, ఉప్పు, నూనె వేసి కలపాలి. మళ్లీ మళ్లీ కలిపి.. మెత్తగా అయ్యేట్లు చేసి.. అరగంట నాననివ్వాలి. మరో గిన్నెలో చీజ్, ఉల్లి, పచ్చిమిర్చి, ప్సికమ్, కొత్తిమీర, చిల్లీఫ్లేక్స్, వామాకు పొడి, ఛాట్ మసాలా, అల్లం తురుము, మిరియాల పొడి వేసి కలపాలి. ఈ స్టఫింగ్‌ను, నానిన గోధుమపిండిని కూడా 6 సమాన భాగాలుగా చేయాలి. పిండితో చిన్న పూరీల్లా వత్తాలి. ఒక్కోదాని మధ్యలో చీజ్ స్టఫింగ్ ఉంచి, అంచులను మూసేయాలి. దానిపై కొద్దిగా పొడి పిండి చల్లి.. స్టఫింగ్ బయటకు రాకుండా జాగ్రత్తగా పరోటాలు చేయాలి. అన్నీ అయ్యాక.. కాలుతున్న పెనంమీద తగినంత నెయ్యి వేసి.. రెండువైపులా కాల్చుకోవాలి. ఉల్లి, క్యాప్సికమ్‌లను చాలా సన్నగా తరిగితే, పరోటా బాగా వస్తుంది. చీజ్ బయటకు రాకుండా అంచులను బాగా సీల్ చేయాలి. సెగ

# ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'టాక్సిక్'.. 'ధురంధర్ 2'ని క్రాస్ చేసిన మూవీ



ఎన్నో వాయిదాల తర్వాత యశ్ 'టాక్సిక్' ఎట్టకేలకు ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ సినిమా ప్రీసేల్ బుకింగ్స్‌లో రికార్డు సృష్టించింది. దీంతో ప్రస్తుతం 'టాక్సిక్' టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారింది.ం

**'ధురంధర్ 2'ను బీట్ చేసిన టాక్సిక్..**

ప్రీసేల్ బుకింగ్స్‌లో ఈ సినిమా హవా చూపించింది . బ్లాక్‌బస్టర్ 'ధురంధర్ 2'ను బీట్ చేసింది. 'ధురంధర్ 2' ప్రీసేల్‌లో 14 లక్షల టికెట్స్ అమ్ముడు కాగా.. 'టాక్సిక్' 16 లక్షలు సేల్ అయ్యాయి. ఈ భారీ ఓపెనింగ్స్‌తో మొదటి రోజు అలవోకగా రూ.100 కోట్లు సాధించవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.

**దయచేసి షేర్ చేయకండి..**

గీతూ మోహన్‌దాస్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం రిలీజ్ నేపథ్యంలో ఆగస్టు 25న రాత్రి 'టాక్సిక్' టీమ్ ఓ ప్రకటన విడుదల చేసింది. 'ఇది కేవలం సినిమా మాత్రమే కాదు.. ఎంతోమంది సాంకేతిక నిపుణులు, నటీనటులు, సిబ్బంది ఎన్నో ఏళ్లపాటు ప్రేమతో, అడుగు అడుగునా కష్టపడి నిర్మించిన ప్రపంచం. మీరు ఈ చిత్రాన్ని థియేటర్లలో బిగ్ స్క్రీన్‌పై అందరితో కలిసి వీక్షించాలని మేం కోరుకుంటున్నాం. థియేటర్లలో సినిమా చూస్తున్నప్పుడు సన్నివేశాలను మీ ఫోన్‌లలో రికార్డ్ చేసి .. సోషల్ మీడియాలో పోస్ట్ చేయద్దు. సినిమా కథని, ట్విస్టులను బయటకు చెప్పొద్దు' అని టీమ్ విజ్ఞప్తి చేసింది.

## అంచనాలు పెంచేలా సుహాస్, సూరి 'మండాడి'



**జన తెలంగాణ సినిమా**

సుహాస్, సూరి ముఖ్య పాత్రలుగా ఎల్రెడ్ కుమార్ సమర్పణలో ఆర్ఎస్ ఇన్ఫోటైన్‌మెంట్ బ్యానర్ మీద మతిమారన్ పుగళేంది తెరకెక్కించిన చిత్రం 'మండాడి'. ఈ మూవీని ఎల్రెడ్ కుమార్ నిర్మించారు. ఈ చిత్రంలో మహిమా నంబియార్ హీరోయిన్‌గా నటించగా.. సత్యరాజ్, రవీంద్ర విజయ్, మిథున్, బాల శరవణన్ తదితరులు ఇతర కీలక పాత్రలను పోషించారు. ఈ మూవీని సెప్టెంబర్ 10న భారీ ఎత్తున రిలీజ్ చేయబోతోన్నారు. ఏపీ, తెలంగాణలో ఈ చిత్రాన్ని మైత్రి మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ఎల్ఎల్‌పి భారీ ఎత్తున విడుదల చేయనుంది.

ఈ క్రమంలో తాజాగా టీజర్‌ను విడుదల చేశారు. 'పందెమే మనల్ని కాపాడుతుంది.. పందెన్నీ మనం కాపాడటం లేదు', 'బరిలోకి దిగే ప్లేయర్స్‌లో నిజాయితీ ఉంటే.. ఈ గాలి, సముద్రం మిమ్మల్ని ఎప్పటికీ ఒగ్గేయదు' అనే డైలాగ్స్, టీజర్‌లో చూపించిన విజువల్స్, బోట్ సీక్వెన్స్, పడవ పందెలకు సంబంధించిన సీన్లు హైలెట్‌గా నిలుస్తున్నాయి. ఇక సుహాస్, సూరి పవర్ ఫుల్ ఎంట్రీలు, జీవీ ప్రకాష్ ఇచ్చిన బీజీఎం నెక్ట్స్ లెవెల్ అని చెప్పుకోవచ్చు. ఎస్.ఆర్. కథిర్ సినిమాటోగ్రఫీ ప్రధాన ఆకర్షణగా నిలుస్తుంది.

టీజర్‌తో ఒక్కసారిగా అంచనాలు రెట్టింపు అయ్యాయి. డైలాగ్స్, ఎమోషన్స్, యాక్షన్స్ ఇలా అన్ని రకాలుగా 'మండాడి' ఇంటెన్స్‌గా ఉండబోతోందని అర్థం అవుతోంది. ఈ సినిమాకి సంగీతాన్ని జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందించగా, ఎస్.ఆర్. కథిర్ సినిమాటోగ్రఫర్‌గా పని చేశారు. ప్రొడక్షన్ డిజైన్‌ను డి.ఆర్.కె. కిరణ్, ఎడిటింగ్‌ను ప్రదీప్ ఇ. రాఘవ్, యాక్షన్ సన్నివేశాలకు పీటర్ హెయిన్, దిలీప్ సుబ్బురాయన్, మహేష్ మాథ్యూ కంపోజ్ చేశారు. తమిళ్, తెలుగు, కన్నడ, మలయాళం, హిందీలో ఈ సినిమాని సెప్టెంబర్ 10న భారీ ఎత్తున విడుదల చేయనున్నారు.

నటీనటులు : సూరి, సుహాస్, మహిమా నంబియార్, సత్యరాజ్, రవీంద్ర విజయ్, మిథున్, బాల శరవణన్ తదితరులు

సాంకేతిక బృందం

బ్యానర్ : ఆర్ఎస్ ఇన్ఫోటైన్‌మెంట్

సమర్పణ : ఎల్రెడ్ కుమార్

క్రియేటివ్ ప్రొడ్యూసర్ : వెట్రిమారన్

నిర్మాత : ఎల్రెడ్ కుమార్

సహ నిర్మాత : మణికందన్

దర్శకుడు : మదిమారన్ పుగళేంది

సంగీతం : జి.వి. ప్రకాష్ కుమార్

కెమెరామెన్ : ఎస్.ఆర్. కథిర్

ఎడిటింగ్ : ప్రదీప్ ఇ. రాఘవ్

యాక్షన్ : పీటర్ హెయిన్, దిలీప్ సుబ్బురాయన్, మహేష్ మాథ్యూ

ప్రొడక్షన్ డిజైన్ : డి.ఆర్.కె. కిరణ్

పీఆర్వో : సాయి సతీష్

## ధర్మన్‌లో శ్రియ?



'పువ్వల్లే నవ్వుల్ నవ్వుల్.. నవ్వల్లే ముయ్వల్ ముయ్వల్.. ' అంటూ 'శివాజి' చిత్రంలో ప్రేమ పాటలు పాడుతూ ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకున్నారు అగ్రహీరో రజనీకాంత్, శ్రియ. ఈ సినిమాతో విజయవంతమైన జోడీ అనిపించుకున్న ఈ జంట ఇప్పుడు మరోసారి తెరపైకి రాబోతుందంటే ప్రేక్షకులకు పండగే కదా! అయితే ఆ దిశగానే చర్చలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. రజనీకాంత్ ప్రధాన పాత్రలో 'ధర్మన్' అనే చిత్రంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. అశ్వత్ మారిముత్తు తెరకెక్కిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. తాజాగా శ్రియ.. రజనీతో కలిసి ఉన్న ఫొటోను 'హ్యాపీ డే' అనే క్యాప్షన్‌తో ఇన్‌స్టాలో పోస్ట్ చేసింది. ఇందులో రజనీ 'ధర్మన్' సినిమా లుక్‌లో కనిపించడంతో.. ఈ చిత్రంలో శ్రియ కూడా ఓ కీలక పాత్రలో మెరవనుందంటూ ప్రేక్షకుల్లో ఊహాగానాలు మొదలయ్యాయి. మరి ఇందులో నిజమెంత ఉందో తెలియాలంటే అధికారిక ప్రకటన వచ్చే వరకూ వేచి చూడాల్సిందే.

## సుజయ్ ప్రొడక్షన్స్ & అర్ఎన్ క్రియేషన్స్ నూతన చిత్రం ప్రారంభం !!!




**జన తెలంగాణ సినిమా**

యష్ తేజ్, జయశ్రీ జంటగా సుజయ్ ప్రొడక్షన్స్ బ్యానర్ లో అర్ఎన్ క్రియేషన్స్ సమర్పణలో చందు దర్శకత్వంలో కె గోపాల్, జె రవీందర్ నిర్మాతలుగా తెరకెక్కబోతున్న ప్రేమకథ చిత్రం పూజా కార్యక్రమాలతో ప్రారంభం అయ్యింది.

ఈ కార్యక్రమంలో నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ్ కెమెరా స్విచ్ ఆన్ చెయ్యగా ముహూర్తం సన్నివేశానికి దర్శకుడు వివిఎన్ ఆదిత్య క్లాప్ కొట్టారు అలాగే మామిడి హరికృష్ణ స్క్రిప్ట్ ను చిత్ర యూనిట్ కు అందజేశారు.

ప్రేమించుకొనే యువత తల్లి తండ్రులని దృష్టిలో ఉంచుకుంటే ఏం జరుగుతుంది? ప్రేమలో ఉన్న అబ్బాయి అమ్మాయి వారి పేరెంట్స్ గురుంచి ఎలా ఆలోచిస్తారు? వంటి సంఘటనలతో ఈ సినిమా కథాంశం ఉంటుందని దర్శకుడు చందు చెబుతున్నారు ఒక సరికొత్త ప్రేమను తెరమీద ఆవిష్కరించబోతున్నందుకు ఆనందంగా ఉందని నిర్మాతలు కె గోపాల్, జె రవీందర్ తెలిపారు. ఈ చిత్రానికి ప్రొడక్షన్ డిజైనర్ భూపతి యాదగిరి, సంగీతం నాగ వంశీ, సినిమాటోగ్రఫీ నాని బిశెట్టి, సురేష్ జిల్లా, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ ఎర్రం రామకృష్ణ

## యుద్ధరంగంలోకి 'గాంధారి'



"ఈ లోకంలో కృష్ణుడు మరోసారి గాంధారిని పరీక్షించాడు. కానీ ఇప్పుడీ మహాసంగ్రామంలో స్వయంగా గాంధారినే యుద్ధరంగంలోకి అడుగుపెట్టబోతుంద"ని అంటోంది తాప్సి. మరి కుమార్తె కోసం రణరంగంలోకి అడుగుపెట్టిన ఆమె గెలిచిందో? లేదో తెలుసుకోవాలంటే 'గాంధారి' సినిమా చూడాల్సిందే. తాప్సి ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రమిది. దేవాశిష్ మఖిజా దర్శకత్వం వహిస్తున్నారు. సెప్టెంబరు 3న నెట్‌ఫ్లిక్స్‌లో రానుందీ చిత్రం. ఈ నేపథ్యంలోనే సామాజిక మాధ్యమాల వేదికగా ట్రైలర్‌ను విడుదల చేసింది సినీబృందం. "మహాభారతంలో గాంధారి తన భర్త కోసం కళ్లకు గంతలు కట్టుకుంది. మరి మీ కుమార్తె కోసం మీరేం చేస్తారు?" లాంటి సంభాషణలతో, యాక్షన్ సీక్వెన్స్‌తో సాగుతున్న ఈ ట్రైలర్ సినీప్రియుల్ని ఆకట్టుకుంటోంది. ఇందులో అదృశ్యమైన తన కుమార్తెను రక్షించుకోవడానికి పోరాటం చేసే అంధురాలైన తల్లి పాత్రలో కనిపించనుంది తాప్సి. ఇష్వాక్ సింగ్, ఛాయా కదమ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు.

## బ్రహ్మాస్త్ర 2 ప్రపంచంలోకి సైయారా సుందరి?



గతేడాది 'సైయారా'తో యువతలో మంచి క్రేజ్‌ను సంపాదించుకుంది బాలీవుడ్ యువకథానాయిక అనీత్ పడ్డా. ఇందులో ప్రేమికురాలిగా కనిపించి కుర్రకారుని ఉర్రూతలూగించిన ఆమె... ఇప్పుడు 'బ్రహ్మాస్త్ర 2' ప్రపంచంలోకి అడుగుపెట్టబోతుందట. హీరో రణ్‌బీర్ కపూర్, అలియా భట్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రమిది. బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకున్న 'బ్రహ్మాస్త్ర'కి సీక్వెల్‌గా దీన్ని అయాన్ ముఖర్జీ తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే ఇందులో దీపికా పదుకొణె ఓ శక్తిమంతమైన పాత్రలో అలరించనుందని వార్తలు వచ్చాయి. ఈ క్రమంలోనే తాజాగా ఈ చిత్రంలో మరో కీలక పాత్ర కోసం అనీత్ పడ్డాను చిత్రబృందం సంప్రదించినట్లు తెలుస్తోంది. ఇంకా చర్చలు జరుగుతున్నాయని, ఒకవేళ అన్నీ అనుకున్నట్లుగా జరిగితే.. ప్రేక్షకులు ఆమెను విభిన్నమైన పాత్రలో చూసి ఆశ్చర్యపోతారని బాలీవుడ్ సన్నిహిత వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం అనీత్.. దర్శకుడు మోహిత్ సూరి తెరకెక్కిస్తున్న ఓ రొమాంటిక్ డ్రామాతో బిజీగా ఉంది.

Published at H.NO. 1-107/3, PALAKURTHIVILLAGE, RAMAGUNDAM DIST, KARIMNAGAR TELANGANA Editor: R. CHAITANYA, RNI NO. TELTEL/2014/61071 Cell: 9701676775